# తిరుపతి - చిత్తూరు

తెలుగు జాతీయ దినపత్రిక వార్త

## ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 146 అర్జీలు

తిరుపతి కార్పొరేషన్, జులై 29, ప్రభాతవార్త



మీ కోసం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చిన అర్జీలను నిర్దేశించిన సమయంలోపు పరిష్కారం అర్థవంతంగా చూపాలని, అలసత్వం సహించేది లేదని జిల్లా కలెక్టర్ డా.ఎస్. వెంకటేశ్వర్ అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక జిల్లా కలెక్టరేట్ నందు ఏర్పాటు చేసిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జిల్లా కలెక్టర్ వారు డిఆర్ఓ పెంచల కిషోర్, డిప్యూటీ కలెక్టర్లు దేవేంద్ర రెడ్డి, రామ్మోహన్, కోదండరామిరెడ్డితో కలిసి వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారుల నుండి వినతులను స్వీకరించారు. మొత్తం 146 వినతులు రావడం జరిగిందని, పరిష్కరించాలని గ్రీవెన్స్‌కు హాజరైన వివిధ శాఖలకు సంబంధించిన అధికారులను జిల్లా కలెక్టర్ ఆదేశించారు.

## యూనియూన్ బ్యాంక్‌లో అగ్ని ప్రమాదం

కోట, జూలై 29 ప్రభాతవార్త



కోట మండలం విద్యానగర్‌లోని యూనియూన్ బ్యాంక్‌లో సోమవారం రాత్రి అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. దీంతో కార్యాల యాంలో ప్రధాన హాల్‌లో ఉన్న కంప్యూటర్లు, ఇతర రికార్డులు, ఫైల్స్ ఈ మంటల్లో కాలి పోయాయి. సమాచారం అందుకున్న కోట అగ్ని మాపక సిబ్బంది వచ్చి మంటలను ఆదుపు చేసే లోపే పర్నిచర్ పూర్తిగా బూడిదైంది. రాత్రి ఏడు గంటల నుంచి 7.30వరకు వర్షం కారణంగా తామంతా బ్యాంక్‌లో ఉన్నామని సిబ్బంది తెలిపారు. మంటలు వ్యాప్తించాయని తెలియడంతో బ్యాంక్ ఖాతాదారులు బ్యాంక్ వద్దకు చేరుకుని ఆరా తీశారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వలనే మంటలు వ్యాపించాయని బ్యాంక్ మేనేజన్ ప్రేమ కుమార్ తెలిపారు. బ్యాంక్‌లో బంగారం లాకర్, క్యాష్ అంతా సేఫ్‌లో ఉందన్నారు. అన్ని కోణాల్లో విచారణపై అధికారులు జరుపుతారని ఆయన పేర్కొన్నారు.

# హరోం హరో హర....

## దక్షిణ కైలాసం పసుపు మయం: ఆడికృత్తిక సంబరాలు



శ్రీకాళహస్తి, జూలై 29 ప్రభాతవార్త

దక్షిణకైలాసం ఆధ్యాత్మికతకు నిలయం. నెల నెలా ఓ ఉత్సవం భక్తుల సంబరం. సాధారణంగా ఈ దివ్యక్షేత్రంలో ఆది నుంచి ఏ ఉత్సవం అయినా రాత్రి ఘడియలున్నపుడు నిర్వహించటం ఆనవాయితీ. ఆలయ ఇఒ వికె ఎన్వియస్ఎన్ మూర్తి ఉత్సవాల్లో ఎలాంటి ఆటంకాలు, అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఆలయంలోని అందరు సిబ్బందిని కుమారస్వామి కొండపై పర్యవేక్షణకు నియమించారు. ఉదయం నుంచి ఆలయ ఇఓ, వారి సిబ్బంది, బైఠాయించారు. వచ్చిన భక్తులకు ఎలాంటి ఇబ్బంది కల్గకుండా ప్రతి ఒక్కరికి సుదర్శన భాగ్యం కల్గించారు. వేకువ జాము 3 గంటల నుంచే ఆలయం వద్ద, నారదపుష్కరిణిలో భక్తుల సందడి కనబడింది.

**హరోం హరా మురుగ . . .**

శ్రీకాళహస్తిలోని విజ్ఞాన గిరిపై జరుగుతున్న మురుగన్ బ్రహ్మోత్సవాల్లో సందర్భంగా సోమవారం సాయంత్రం అయిదు గంటలకు అందిన సమాచారం మేరకు 40వేలకు పైగా భక్తులు దర్శనం చేసుకున్నట్లు సమాచారం. మధ్యాహ్నం నుంచి చుట్టుపక్కల గ్రామాల నుంచి జనం తరలి వచ్చారు. ' ఆడిమాసంలో(ఆషాఢం) నిర్వహించే ఉత్సవాలు ఆడికృత్తిక బ్రహ్మోత్సవాలు. ఈ ఉత్సవాల్ని శ్రీకాళహస్తీశ్వరాలయంలో చెంగల్వరాయ స్వామి బ్రహ్మోత్సవాలుగాను, అనుబంధంగా నిర్వహిస్తున్న కుమారస్వామి కొండపై వెలసిన సుబ్రమణ్యం స్వామి ఆలయంలో మహోత్సవాలుగా నిర్వహిస్తున్నారు. తిరుపతిజిల్లాలోని శ్రీకాళహస్తీశ్వరాలయంలో వెలసిన భోళాశంకరుడు స్వయంభువుగా వెలసి భక్తుల కొంగుబంగారంగా వరాలిస్తుంటే ఆయన తనయుడు కుమారస్వామి తన వద్దకు పరుగున వచ్చే భక్తులకు విజ్ఞానాన్ని ఒసగుతున్నాడు. భక్తులు మదినిండా భక్తి భావం, భక్తి పారవశ్యంతో భుజంపై కావడి, శుభం జరగాలనే ఆకాంక్షతో పసుపు బట్టలు ధరించిన భక్తులు తరలి వచ్చారు.

### మయూరవాహనంపై

## షణ్ముఖుని దివ్యదర్శనం



శ్రీకాళహస్తి, జులై 29 ప్రభాతవార్త

శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధ ఆలయంగా విజ్ఞానగిరిపై వెలసిన కుమారస్వామి ఆడికృత్తిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆడికృత్తికను పురస్కరించుకుని సోమవారం రాత్రి కుమారస్వామి మయూరవాహనంపై పురప్రజలకు దర్శనమిచ్చారు. వల్లిదేవసేన సమేత సుబ్రమణ్యం స్వామి ఉత్సవమూర్తులను సర్వాంగసుందరంగా ముస్తాబుచేసి బోయిలు మోసుకుంటూ తీసుకువచ్చి ఆలయం వెలుపల ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన మయూరవాహనంపై ఆశీనుల్ని చేసి పట్టణంలో ఊరేగింపు నిర్వహించారు. ఇఒ ఎన్వియస్ఎన్ మూర్తి హారతులిచ్చి మొక్కులు తీర్చుకున్నారు. ఉత్సవాన్ని కాలంలో నిర్వహించటంలో ఇన్‌చార్జి లక్ష్మయ్య విజయం సాధించారు. చిన్న ఆలయాల పర్యవేక్షకుడు లక్ష్మయ్య పర్యవేక్షణలో ఉత్సవాలు సాగాయి. ఆడికృత్తిక సందర్భంగా రాత్రి ఉత్సవం ఇట్టే భక్తులకు ఆకట్టుకుంది. అలంకారం అదరహో అనిపించింది.

## నామస్మరణలతో మార్మోగిన గుడివంక.. లక్షలాదిగా తరలివచ్చిన భక్తులు







గుడుపల్లి, జూలై29, ప్రభాతవార్త

నియోజక వర్గంలోని గుడుపల్లి, మండలం పెద్దగొల్లపల్లి గ్రామ సమిపంలో అటు కర్నాటక ఇటు తమిళనాడు, సరిహద్దులో పశ్చిమదారావాహినిగా, పేరుగాంచిన గుడివంక వేపమాను గట్టుపైవలసిన శ్రీవల్లి దేవసేన సమేత సుబ్రమణ్య స్వామి దేవాలయం, ఆడికృత్తిక సందర్భంగా సోమవారం భక్తులతో హరోం హరో హర, వేల్ మురుగ, నామాలతో భక్తులతో కావళ్ళతో కిట కిటలాడింది. ఇక్కడవెలసిన శ్రీవల్లి దేవసేన సమేత సుబ్రమణ్య స్వామి, కోరిన భక్తుల కోర్కేలు తీర్చే స్వామిగా పేరు గాంచాడు. ఏటా ఇక్కడ తమిళాడి మాసంగా భావించే ఆడికృత్తిక సందర్భంగా, భక్తులు లక్షల్లో ఇక్కడికి చేరుకోవడం విశేషం. మొక్కులు కలిగిన భక్తులు వివిద రకాల కావళ్లతో తరలి వచ్చారు. అంతేకాకుండా ఒళ్లు గగ్గుర్పాటు కలిగించె విదంగా విన్యాసాలు, తేరుకావళ్లు, రాతిగుండలు, టెంపోలు, లాగుతూ, పోక్లైన్లతో విన్యాపాలు, చేసి తమ భక్తిని చాటుకోన్నారు. కుప్పం నియోజక వర్గంలోనే కాకుండా కర్నాటక, తమిళనాడు, రాష్ట్రాలనుండి కూడా భక్తులు ఆడికృత్తిక సందర్బంగా పోటెత్తారు. సంతానవరాన్ని ప్రసాదించె స్వామిగా శ్రీవల్లి దేవసేన సమేత సుబ్రమణ్యస్వామిగాపేరోందినారు. కాగా ఆలయం చూపరులను భక్తులను ఇట్టె ఆకట్టుకోవడంతో, భక్తులు స్వామివారిని ధర్శించుకోనేందుకు తండోప తండాలుగా వచ్చారు. ఆలయానికి వచ్చే భక్తులకు మాజీ ఎంపీసీ చైర్మన్, సమన్వయ కమిటీ కన్వీనర్ చంద్రశేఖర్, మండల టిడిపీ అధ్యక్షుడు బాబునాయుడు, ఉత్సవకమిటి, మరియూ ఆలయఅదికారులు భక్తులకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. స్వామివారి దర్శనం సులువుగా లబించెలా క్యూలైన్లు ఏర్పాటు చేశారు. అదేవిదంగా త్రాగునిరు, అత్యవసర వైద్యసేవలు ఏర్పాటు చేశారు. వివిద ప్రాంతాలనుండి వచ్చే భక్తులకు కుప్పం ఆర్.టి.సి. అదికారులు కుప్పంనుండి ప్రత్యేక బస్సులు, అదనపు సర్వీసులు ఏర్పాటు చేశారు.

**పోలీసులు గట్టి బందోబస్తు.**

ఎటువంటి అవాంచనియ సంఘటనలు భక్తులకు జరగకుండా, కుప్పం డియస్‌పి బి.శ్రీనాథ్, సి.ఐ.మల్లేష్ యాదవ్, నేత్రుత్వంలో యస్.ఐ. శ్రీనివాసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. 2సిఐలు, 5మంది యస్ఐలు, ఎయస్ఐలు12 మంది, 35 మంది కానిస్టేబుల్స్, హోమ్‌గార్డ్స్ 23, మొత్తం 100 మందితో బందోబస్తు ఏర్పాటు చేశారు.

**ఉచిత వైద్యశిబిరం**

గుడివంక ఆలయంవద్ద బి.ఆర్.మెమోరియల్ ట్రస్ట్ డాక్టర్ సురేష్ బాబు ఆద్వర్యంలో, ఉచిత వైద్యశిబిరం ఎర్పాటు చేశారు. ఉచిత మందులు పంపిణి చేశారు. కార్యక్రమంలో మాజీ జడ్.పి.టి.సి.బేటప్ప నాయుడు, మాజీ పార్టి అద్యక్షుడు హేమాంబర్ గౌడు, సుబ్బు, బానుమూర్తి, అరుణాచలం, మంజూ, గోపాల్, రాజ్‌గోపాల్, కిష్నప్ప, మరియు నేతలు, సహాయ కమిషనర్ తదితరులు పాల్గోన్నారు.

## డబ్బుల కోసం కిడ్నాప్

### చేధించిన పోలీసులు

### నకిలీ ఆయుధాలు స్వాధీనం



భాకరాపేట, జులై 29ప్రభాతవార్త:

డబ్బులకోసం ఓ వ్యక్తిని సినిమాఫక్కీలో కిడ్నాప్‌చేసిన కేసును భాకరాపేట పోలీసులు చేధించారు. నలుగురు నిందితులను అరెస్టుచేసి వారినుండి నకిలీ పిస్టల్, మత్తుమందు ఇంజెక్షన్లు, రెనాల్ట్‌ట్రైబర్ వాహనం స్వాధీనం చేసుకున్నారు. తిరుపతి జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడు ఆదేశాలతో, అదనపు ఎస్పీ కులశేఖర్, చంద్రగిరి డిఎస్పీ నరసింగప్ప, సిఐలు శ్రీనివాసులు, శ్రీకాంత్‌రెడ్డి, భాకరాపేట ఇన్‌ఛార్జి ఎస్ఐ ఈశ్వరయ్య పోలీసు సిబ్బంది ఈ కేసును చేధించారు. తిరుపతి జిల్లా చిన్నగొట్టిగల్లుమండలం చెరువుముందరపల్లికి చెందిన జంగం భాస్కర్‌ను ఈనెల 24వతేదీ ఉదయం భాకరాపేట ఘాట్‌రోడ్డులో పెట్రోల్‌బంకు సమీపంల తన ఆటోలో వెళుతుండగా కిడ్నాపర్లు బాతుకోళ్ళ మహమ్మద్‌జీషాన్(26)చిన్నగొట్టిగల్లు, బెంగుళూరుకు చెందిన మహమ్మద ఖాసిప్(25), ఆర్కంఖాన్(27), అన్నమయ్యజిల్లా మహల్‌కు చెందిన షేక్‌జాహిద్‌భాష(23)లు ఓ వాహనంలో నకిలీ తుపాకి, మత్తుఇంజక్షన్‌లతో బాధితుడ్ని బెదిరించి కిడ్నాప్ చేశారు. అతని కుమారుడు రెడ్డికిరణ్‌కు ఫోన్‌చేసి 5కోట్ల రూపాయలు డిమాండ్ చేశారు. నిందితులు పై పోలీసులకు సమాచారం అందింది.

### నెమలి వాహనంపై దర్శనమిచ్చిన

## సతీ సమేత సుబ్రమణ్యం స్వామి



పాకాల, జులై 29, ప్రభాతవార్త

పాకాల మండలం ఊట్లవారిపల్లి గ్రామం ఆనంద గిరి కొండపై వెలసి వున్న శ్రీ వల్లి దేవసేన సమేత సుబ్రమణ్య స్వామి సోమవారం సాయంత్రం భరణిదీపోత్సవం గావించి తదుపరి రాత్రి నెమలి వాహనం పై ఆశీనులై దర్శనమిచ్చారు. ఉభయదారులు రాయ యశోదమ్మ రెడ్డయ్య చౌదరి, రాయ సరస్వతి యుగంధర్ చౌదరి, ఈవో ఎస్. యువరాణిఆలయ చైర్మన్ సోంపల్లి చంద్రశేఖర్ నాయుడు ఆలయ ప్రధాన అర్చకులు కృష్ణమూర్తి శర్మ, ఎమ్మెల్యే పులివర్తి నాని తొలి హారతి అందుకున్నారు. అనంతరం ఆ దేవదేవుడు పురవీధిలలో ఊరేగి భక్తులకు అభయహస్తం ఇచ్చారు. గ్రామ ప్రజలు దేవిదేవేరులకు భక్తిశ్రద్ధలతో తమ మొక్కులు తీర్చుకున్నారు.

## పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టమ్‌కు 113 సమస్యలు



చిత్తూరు, జులై 29 ప్రభాతవార్త:

ప్రజా సమస్యలను పరిష్కరించడానికి ప్రతి సోమవారం కలెక్టరేట్‌లోని నూతన సమావేశభవనంలో కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించే పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టంకు ఈ వారం జిల్లా నలుమూలల ప్రజల నుండి సమస్యలపై 113 అర్జీలు అందాయి. ఈ అర్జీలను పరిశీలించిన కలెక్టర్ సుమిత్ కుమార్ సత్వరం సమస్యలను క్షేత్ర స్థాయికి వెళ్ళి పరిశీలించి పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో కలెక్టర్ సుమిత్‌కుమార్‌తో పాటు జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు, డిఆర్ఓ బి.పుల్లయ్య, డ్వామా పిడి రాజశేఖర్‌లు హాజరై ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు కలెక్టరేట్‌లో ప్రతి సోమవారం జరిగే పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టం కార్యక్రమం ఉదయం 9.30 గంటల నుండి మధ్యాహ్నం 1.30 గంటల వరకు జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజల నుండి సమస్యలపై అందిన అర్జీలను పరిశీలించి పరిష్కరించడం జరుగుతుందని ఈ కార్యక్రమానికి ప్రతి శాఖకు సంబంధించి జిల్లా, మండల, గ్రామ స్థాయి అధికారులు హాజరవడం జరుగుతుందన్నారు.

## దాయ్ యాప్ మోసాలపై 224 మంది బాధితులు ఫిర్యాదు

### -224 మంది బాధితులు రూ.4.6కోట్లుగా అంచనా-మోప్మా పిడి

పలమనేరు, జూలై 29, ప్రభాతవార్త:

పలమనేరులో జరిగిన దాయ్ యాప్ మోసాలపై జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు సోమవారం పలమనేరు మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన ఫిర్యాదుల స్వీకరణ కార్యక్రమంలో 224 మంది ఫిర్యాదు చేశారు. పలమనేరులో గత వారం రోజులుగా దాయ్ యాప్ బాధితులు ఎమ్మెల్యే, డిఎస్పీ, సిఐ, ఎస్ఐ ఫిర్యాదులు చేస్తున్నారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ మెప్మా పిడి రాదమ్మ, డిటి జయలక్ష్మీ, సిఐ చంద్రశేఖర్‌లతో ఓ కమిటీని ఏర్పాటు చేసి పట్టణంలో ఫిర్యాదుల స్వీకరణ కార్యక్రమాన్ని ఈనెల 29,30న నిర్వహించాలని ఆదేశించారు. ఈ క్రమంలో స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఉదయం 10గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు ఫిర్యాదుల స్వీకరణ చేపట్టారు. ఈ మేరకు మెప్మా పిడి మాట్లాడుతూ పలమనేరులో మెప్మా సిబ్బంది, ఆర్‌పిలు ఈ యాప్‌లో పెట్టుబడులు పెట్టేందుకు కీలకంగా వ్యవహరించారని వచ్చిన ఫిర్యాదు మేరకు ఫిర్యాదులు స్వీకరణ కార్యక్రమం నిర్వహించామని తెలిపారు. ఒక్క రోజులో 224 మంది ఫిర్యాదు చేశారని ఇప్పటి వరకు రూ.46,085,404లు కోల్పోయినట్లు ఫిర్యాదు చేశారని తెలిపారు. పలమనేరులో మెప్మా సిబ్బంది రాజేష్ సూచనతో ఆర్‌పిలు, గ్రూపు మహిళలు ప్రజలను ఈ యాప్‌లో రూ.10వేల నుండి రూ.కోటి వరకు వ్యక్తులు పెట్టుబడులు పెట్టారని తెలిపారు. బాధితులు నేరుగా ఫిర్యాదు చేయలేని పక్షాన 1930కు ఫోన్

### శ్రీబాల జ్ఞాన దండాయుధస్వామి ఆలయంలో

## ఆడికృత్తిక ఉత్సవాలు

### - పట్టు వస్త్రాలు సమర్పించిన ఎమ్మెల్యే పులివర్తి నాని

తిరుపతిరూరల్, జులై 29 ప్రభాతవార్త:



తనపల్లి పద్మగిరి కొండపై వెలసిన శ్రీబాల జ్ఞాన దండాయుధపాణి స్వామి ఆలయంలో ఆడికృతిక ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఆడికృత్తిక ఉత్సవాలను పురస్కరించుకుని సోమవారం ఎమ్మెల్యే పులివర్తి నాని పట్టువస్త్రాలు సమర్పించారు. అనంతరం ఎమ్మెల్యే స్వామికి ప్రత్యేక పూజలు చేసారు. రాష్ట్ర ముఖ్యమంత్రి పేరిట కుటుంబ సభ్యుల పేరుపై అర్చన చేయించారు. నియోజకవర్గ ప్రజలు సుఖశాంతులతో ఉండాలని ప్రార్థించారు. ఆడికృత్తిక ఉత్సవాలను పురస్కరించుకుని శ్రీబాల జ్ఞాన దండాయుధపాణి స్వామిని భక్తులు పెద్ద ఎత్తున దర్శించుకున్నారు. మొక్కుబడి వున్న భక్తులు కావడితో వచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. స్వామివారిని ఉదయం 5గంటలకు సుప్రభాత సేవతో మేల్కొలిపి, సుగంధ భరిత ద్రవ్యాలతో అభిషేకం నిర్వహించారు. స్వామి దర్శనానికి విచ్చేసిన భక్తులకు తీర్థప్రసాదాలు అందజేసారు. ఈ కార్యక్రమంలో బాలచంద్రారెడ్డి, రామప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### పద్మావతి వర్సిటీలో

## "పట్టు" తప్పుతున్న పర్యవేక్షణ !

### -మద్యంమత్తులో సిబ్బంది విధులకు

### -ఎవరొస్తున్నారో...పోతున్నారో కొరవడిన నిఘాల

ప్రభాతవార్త-తిరుపతిటౌన్:

ఉమ్మడిఆంధ్రప్రదేశ్‌లో తొలి మహిళ విశ్వవిద్యాలయం పద్మావతి మహిళ విశ్వవిద్యాలయంలో పరిపాలన పరంగా బోధన బోధనేతర సిబ్బందిపై పై అధికారిణుల పర్యవేక్షణ పట్టుతప్పుతోందనే విమర్శలు బలంగా వినిపిస్తున్నాయి. ఎంతో చరిత్ర ఉన్న....విద్యాబోధనలో నాక్ ఏ+గ్రేడ్ సంతరించుకున్న ఈ విశ్వవిద్యాలయంలో కొందరు క్రిందిస్థాయి సిబ్బంది, వివిధ రకాలుగా సేవలందిస్తున్న సిబ్బంది మద్యం సేవించి మత్తులో విధులకు వస్తున్నారనే ఆరోపణలు గుప్పుమంటున్నాయి. విశ్వవిద్యాలయం ప్రాంగణంలో పూర్తిగా విద్యార్థినులు, యువతులే ఉంటున్నారు. వీరికి విద్యాబోధన దాదాపు మహిళ ఆచార్యులే...అధ్యాపకులే. అయితే వర్సిటీలో పలు రకాల సిబ్బంది తూతూ మంత్రంగా మొక్కుబడి విధులునిర్వహిస్తుంటారు.




సేవలందించేందుకు అవసరమైన పొరుగుసేవల సిబ్బంది ఇప్పటికే మత్తులో వస్తుంటారని విద్యార్థినులు వాపోతున్నారు. గతంలో పలుమార్లు అధ్యాపకులకు చెప్పినా పట్టించుకోలేదనేది వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. వర్సిటీలో అన్ని కోర్సులకు సంబంధించి దాదాపు నాలుగువేలమంది వరకు విద్యార్థినులు విద్యనభ్యసిస్తున్నారు. వీరిలో 2,500వేలమంది వరకు విద్యార్థినులు వర్సిటీ ప్రాంగణంలోని హాస్టళ్ళలోనే వసతి పొందుతున్నారు. వీరికి భోజనాలు తయారుచేసే కుక్‌లు కూడా మగవారే కావడం మరో విశేషం. ఇక్కడ విద్యార్థినులపై పర్యవేక్షణ లేకపోవడంతో పలు ఘటనలు జరిగాయి. రాయలసీమ జిల్లాలకే తలమానికంగా ఉన్న తిరుపతిలోని ప్రధాన విశ్వవిద్యాలయాల్లో పద్మావతి మహిళ విశ్వవిద్యాలయం ఒకటి. ఇక్కడకు ప్రవేశద్వారాల వద్ద పూర్తిస్థాయి నిఘా కొరవడింది. విశ్వవిద్యాలయంలోనికి ఉదయం నుండి సాయంత్రం వరకు ఎవరు వస్తున్నారు, ఎవరు వెళుతున్నారనే కనీస సమాచారం కూడా ఉండదు. విద్యార్థినులు ఉంటున్న చోటుకు కొత్తవ్యక్తులు ఎవరైనా యధేచ్ఛగా లోపలకు వెళ్ళి బయటకు రావడం జరుగుతోంది. ఆటోలు, కార్లు, ఇతరత్రా వాహనాల్లో మహిళ విశ్వవిద్యాలయంలోనికి వెళుతున్నా ప్రవేశగేట్ల వద్ద ప్రశ్నించే సెక్యూరిటీ వారే లేకపోతున్నారు. యూనివర్సిటీల ప్రవేశనిష్క్రమణ మార్గాల గేట్ల వద్ద కనీసం సిసికెమెరాలు గానీ ఏర్పాటుచేయలేకపోవడం ఆశ్చర్యకరంగా మారింది. ఏదేని జరగరాని సంఘటనలు జరిగినపుడు నానా హంగామా చేసే విశ్వవిద్యాలయం అధ్యాపకులు, ఆచార్యులు, విద్యార్థిసంఘాల నాయకులు విద్యార్థినుల భద్రతపై చర్యలు తీసుకోవడంలో విఫలమయ్యారనేది స్పష్టమవుతోంది. తెలుగురాష్ట్రాల నుండి నాణ్యమైన ఉన్నతవిద్యకోసం విద్యార్థినులు తిరుపతిలో చదవడం పై ప్రత్యేక దృష్టిసారిస్తుంటారు. పలు రకాల ఉన్నత కోర్సుల్లో ప్రవేశాలు పొందుతున్న వారు దాదాపు ఐదువేల మందికిపైగానే విద్యార్థినులు ఉంటారు. ఇక్కడ విద్యార్థినులకు తగిన భద్రత కల్పించాల్సిన అవసరం విశ్వవిద్యాలయం విసి, రిజిస్ట్రార్‌పై, డీన్‌లపై ఉంది. ప్రధాన గేట్‌తోబాటు హాస్టల్స్ కెళ్ళే మరో గేట్ ఉంది. ఈ రెండు గేట్లలో ఔట్‌సోర్సింగ్ సెక్యూరిటీ

## గణనాథుని సన్నిధిలో పూతలపట్టు ఎమ్మెల్యే

కాణిపాకం, జూలై 28 ప్రభాతవార్త:

పూతలపట్టు ఎమ్మెల్యే డాక్టర్ కలికిరి మురళీమోహన్ సోమవారం సత్య ప్రమాణాలకు నెలవైన కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామివారిని కుటుంబసమేతంగా దర్శించుకున్నారు. ఆలయ దర్శనార్థం వచ్చిన వారికి ఆలయ ఏఈఓ విద్యాసాగర్‌రెడ్డి, అర్చకులు ఆలయ మర్యాదలతో రాజగోపురం వద్ద పూర్ణకుంభంతో ఘనంగా స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం వారు స్వామివారి సేవలో పాల్గొని ప్రత్యేకపూజలు నిర్వహించారు. వారికి వేదమండపంలో వేదాశీర్వచనం చేసి స్వామివారి శేషవస్త్రంతో సత్కరించి ప్రసాదాలను, చిత్రపటాన్ని అందజేశారు. ఎమ్మెల్యే వెంట ఆలయ మాజీ ఛైర్మన్ మణినాయుడు, స్థానిక మాజీ సర్పంచ్ మధుసూదన్‌రావు, మాజీ జడ్పీటీసీలు ఎం.లత, వెంకటేశ్వర చౌదరి, మండల టీడీపీ అధ్యక్షుడు మల్లారపల్లె గిరినాయుడు, స్థానిక నాయకులు శేషాద్రినాయుడు, నరసింహులునాయుడు, హేమాద్రినాయుడు తదితరులు పాల్గొన్నారు.

## అన్నెమ్మగారిపల్లిలో ఘనంగా గంగ జాతర

సోమల, జులై 29, ప్రభాతవార్త

సోమల మండలంలోని పెద్ద ఉప్పరపల్లి, అన్నమ్మగారిపల్లి పంచాయితీలో గంగ జాతర కార్యక్రమాన్ని ఆదివారం రాత్రి సోమవారం ఉదయం నిర్వహించారు. పుంగ నూరుకు చెందిన రిటైర్డ్ డిఎస్పి సుకుమార్ దంపతులు గంగమ్మ దర్శించుకుని గాజులను అమ్మవారికి కానుకగా సమర్పించుకున్నారు. గంగ జాతర సందర్భంగా నిర్వహించిన కార్యక్రమాలు భక్తులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఆదివారం రాత్రి కులాల వారీగా భక్తులు సామూహికంగా వచ్చి బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. సోమవారం సాయంత్రం అమ్మవారిని జలాధివాసం చేయడంతో జాతర ముగిసింది. జాతర సమయంలో భక్తుల సౌకర్యం కోసం పంచాయితీ ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం విమర్శలకు దారితీస్తోంది.

## నేటి నుంచి శ్రీకళ్యాణవెంకన్న పవిత్రోత్సవాలు

పుంగనూరు, జూలై 29 ప్రభాతవార్త :

పుంగనూరు జమీందారులచే నిర్మించబడిన పురాతన శ్రీకళ్యాణవేంకటరమణస్వామి వారి ఆలయంలో మంగళవారం నుంచి పవిత్రోత్స వాలు నిర్వహిస్తున్నట్లు కార్యనిర్వహణాధికారి మునేంద్రబాబు తెలిపారు. 30న అంకురార్పణ, 31న యాగశాల కైంకర్యప్రతిష్ఠిత, ఆగస్టు 1న పవిత్ర సమర్పణ, 2న స్నపన తిరుమంజనం, పూర్ణాహుతి నిర్వహిస్తామన్నారు. ఈరోజులలో స్వామివారు అమ్మవార్లతో మాడవీధులలో దర్శనమిస్తారన్నారు.

## రేపు కుప్పంలో ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక

– జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్

కుప్పం, జూలై 29 ప్రభాతవార్త

ప్రజా సమస్యల పరిష్కారంలో భాగంగా ఈనెల 31వతేది బుధవారం కుప్పం మండల పరిషత్ కార్యాలయంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ తెలిపారు. కుప్పం నియోజకవర్గ ప్రజల సమస్యల పరిష్కారానికి ముందడుగు వేసి ఈ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. నియోజకవర్గ, మండల స్థాయి అధికారులు ఈ కార్యక్రమానికి హాజరు కావాలన్నారు. నియోజకవర్గ ప్రజలు తమ సమస్యల పరిష్కారానికి ఈకార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కోరారు. కాగా జూలై నెలలో ఇప్పటికే జూలై 4, 18 తేదీల్లో కుప్పంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం జరగగా ఈనెల 31న జరిగే కార్యక్రమం మూడోది. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సొంత నియోజకవర్గం అయిన కుప్పంలో ప్రజాసమస్యలను త్వరగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ ప్రత్యేక చొరవ తీసుకుంటున్నారు.

## ఇరువర్గాల మధ్య ఘర్షణ.. కేసులు నమోదు

కుప్పంరూరల్, జూలై 29 ప్రభాతవార్త

మండలంలోని రాములగుట్టచేను గ్రామంలో నగదు లావాదేవీలకు సంబంధించి ఇరువర్గాల మధ్య ఘర్షణ జరిగింది. దీంతో ఇరువర్గాలు పోలీసులను ఆశ్రయించడంతో కేసు నమోదు చేశారు. ఈసంఘటనకు సంబంధించి స్థానికుల కథనం మేరకు వివరాలిలా.. గ్రామానికి చెందిన చంద్రప్ప, శ్రీనివాసులు దగ్గర బంధువులు. వీరిలో చంద్రప్ప దగ్గర శ్రీనివాసులు కొంత నగదు అప్పుగా తీసుకున్నాడు. ఈ నేపథ్యంలో చంద్రప్ప తనకు రావాల్సిన నగదు గురించి శ్రీనివాసులును ప్రశ్నించగా పదిమందిలో తనను డబ్బు అడిగి అవమానించాడని భావించిన శ్రీనివాసులు వర్గీయులు చంద్రప్ప వర్గంపై దాడికి దిగగా ఇరువర్గాల వారు గొడవ పడ్డారు. పలువురికి గాయాలయ్యాయి. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## రోటరీ అధ్యక్ష్య,కార్యదర్శులుగా హరిప్రసాద్,భాస్కర్

పుంగనూరు, జూలై 29 ప్రభాతవార్త :

పుంగనూరు రోటరీ సెంట్రల్ అధ్యక్షుడుగా పట్టణానికి చెందిన ఎస్ఎస్ రెసిడెన్సీ అధినేత, ఆవుల హరిప్రసాద్‌రెడ్డి, కార్యదర్శిగా చైతన్య ప్రిన్సిపాల్ భాస్కరరెడ్డిలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు, రోటరీస్థానిక శాఖ కార్యవర్గ ఎన్నికలు సోమవారం జరిగింది. నూతనంగా ఎంపికయిన అధ్యక్ష్య, కార్యదర్శుల ప్రమాణస్వీకారం ఆగస్టు1న నిర్వహిస్తామని ప్రస్తుత కార్యదర్శి సిఎస్ రాజారెడ్డి తెలిపారు. కార్యక్రమంలో క్లబ్ రోటేరియన్లు డాక్టర్ ప్రభాకర్, డాక్టర్ విజయకుమారి, డాక్టర్ శరణ్, భాస్కరశెట్టి, పూల త్యాగరాజు, షావలీ టెక్స్‌టైల్స్ అధినేత అర్షద్ అలీ, సుధాకర్‌రెడ్డి, వేణుగోపాల్‌రాజు, భాస్కర్‌లు పాల్గొన్నారు.

## పిఎఫ్ సమస్య పరిష్కారం చేయకుంటే ప్రత్యక్ష కార్యాచరణ

### - జడ్పీ సిఇఓ గ్లోరియాకు యుటిఎఫ్ నాయకులు అల్టిమేటం

చిత్తూరు, జులై 29 ప్రభాతవార్త:



ఉమ్మడి చిత్తూరు జిల్లాకు సంబంధించి ఉద్యోగ, ఉపాధ్యాయుల జడ్పీ పిఎఫ్ సమస్యను పరిష్కరించాలని సంవత్సర కాలంగా విన్నవిస్తున్నప్పటికీ ఆశించిన ఫలితం లేకపోవడంతో జడ్పీ కార్యాలయం ఎదుట నిరసన చేయాలని ప్రత్యక్ష కార్యాచరణ సిద్ధం చేసినట్లు యుటిఎఫ్ నాయకులు సోమవారం జడ్పీ సిఇఓ గ్లోరియాను కలిసి అల్టిమేటం జారీ చేశారు. జడ్పీ పిఎఫ్ సమస్యను పరిష్కరించాలని జడ్పీ సిఇగో గ్లోరియాను సోమవారం జడ్పీ సిఇఓ ఛాంబర్‌లో రాష్ట్ర యుటిఎఫ్ కార్యదర్శి జివి రమణ, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం.సోమశేఖర్‌నాయుడు, ఎం.మణిగండన్ తదితరులు కలిశారు. ఈ సందర్భంగా వీరు జడ్పీ సిఇఓతో మాట్లాడుతూ ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగ, ఉపాధ్యాయులు గత ఐదేళ్ళ నుండి జడ్పీ పిఎఫ్ ఖాతాలను అప్‌డేట్ చేయాలని, 2019–20 నుండి ఇప్పటి వరకు నెలవారీ చందాల వివరాలను ఏ ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఆ ఆర్థిక సంవత్సరం పూర్తి స్థాయిలో ప్రదర్శన వుంచి అందుకు సంబంధించి వడ్డీని జమ చేయాలని పలుమార్లు కోరడం జరిగిందన్నారు. అలాగే ఇటీవల మృతి చెందిన ఉపాధ్యాయుల కుటుంబాలకు సంబంధించి సభ్యులకు కారుణ్య నియామకాలు చేపట్టాలని కోరడం జరిగిందన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయుల పిఎఫ్‌కు సంబంధించి ఇప్పటికే రెండు సార్లు కలిసి విన్నవించినా పురోగతి లేకపోవడంతో విధి లేని పరిస్థితుల్లో సమస్యను పరిష్కరించానికి ఆగస్టు చివరి నాటికి ప్రత్యక్ష కార్యాచరణ ప్రకటిస్తామని వారు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ నాయకులు సుధాకర్‌రెడ్డి, రెహెనాబేగం, రెడ్డప్పనాయుడు, సరిత, బాలాజీ, వంశీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ఆడికృత్తిక ఉత్సవాలు..

### భారీ ఎత్తున అన్నదానం

కుప్పం, జూలై 29 ప్రభాతవార్త



కుప్పం పట్టణంలోని బైపాస్‌రోడ్‌లో వెలసిన శ్రీ బాలసుబ్రమణ్యస్వామి ఆలయంలో ఆడికృతిక ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఉదయం స్వామివారికి ప్రత్యేక అభిషేకం నిర్వహించారు. మున్సిపల్ టిడిపి అధ్యక్షుడు రాజ్‌కుమార్ నేతృత్వంలో ఆలయం వద్ద మధ్యాహ్నం భక్తులకు పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమం జరిపారు. సాయంత్రం స్వామివారిని బాణ వేడుకలు, పంబవాద్యాల మధ్య పుష్పపల్లకిలో ఊరేగించారు. కార్యక్రమాల్లో సతీష్, వినయ్, రాజేష్, ప్రతాప్, నరేష్, శేఖర్, సింధు తదితరులు పాల్గొన్నారు.

## రైతు మిత్ర సంఘాలు ఏర్పాటుచేయాలి

రామకుప్పం, జూలై 29 ప్రభాతవార్త



మండలంలో రైతులు రైతు మిత్ర సంఘాలు ఏర్పాటుచేయాలని మండల టిడిపి అధ్యక్షుడు ఆనందరెడ్డి తెలిపారు. సోమవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం రైతు సంఘాలకు గతంలో ఇచ్చిన విధంగా బ్యాంకు రుణాలు, వ్యవసాయ పనిముట్లు, రాయితీతో యంత్రాలను అందిస్తుందన్నారు. ప్రకృతి వ్యవసాయ విధానాలపై రైతులు అవగాహన పెంచుకోవాలన్నారు. కార్యక్రమంలో నేతలు నరసింహులు, చిన్నికృష్ణ, సీతాపతి, వెంకటరమణ, రైతులు పాల్గొన్నారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## శ్రీవీరాంజనేయస్వామి పంచలోహ విగ్రహం చోరీ

రామకుప్పం, జూలై 29 ప్రభాతవార్త

స్థానిక పిల్లిగుట్ట వద్ద వెలసిన శ్రీ వీరాంజనేయస్వామి ఆలయంలోని స్వామివారి పంచలోహ విగ్రహం చోరీకి గురైనట్లు ఆలయ కమిటీ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. సుమారు రెండు అడుగుల ఎత్తు, ఆరు కిలోల బరువు గల పంచలోహ విగ్రహం విలువ సుమారు ముప్పై వేలదాకా ఉంటుందని తెలిపారు. రాళ్లబూదుగూరు ఎస్సై నరేష్ ఆలయం వద్దకు చేరుకుని ఆలయ పరిసర ప్రాంతాలు పరిశీలించారు. చిత్తూరు నుంచి క్లూస్ టీం సైతం వచ్చి ఆలయాన్ని పరిశీలించింది. రామకుప్పం పోలీసులు కేసు నమోదు చేశారు.

## ఆడికృత్తిక పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే గురజాల

చిత్తూరురూరల్, జూలై 29 ప్రభాతవార్త:



చిత్తూరునగరం, బజారు వీధిలో వెలసిన ప్రముఖ షణ్ముగ సుందర వినాయకస్వామి ఆలయంలో నిర్వహించిన ఆడికృతిక వేడుకల్లో శాసనసభ్యులు గురజాల జగన్మోహన్ ముఖ్యఅతిధిగా పాల్గొని ప్రత్యేక పూజాకార్యక్రమాల్లో నిర్వహించారు. అంతకు మునుపు ఆలయ ఇవో తిమ్మారెడ్డి, ప్రధాన అర్చకులు వేద ఆశీర్వచనాలతో శేష వస్త్రాలను కప్పి పూర్ణకుంభంతో ఘనంగా స్వాగతం పలికి స్వామి వారి దర్శనభాగ్యం కల్పించి తీర్థప్రసాదా లను అందజేసారు. ఈ పూజా కార్యక్రమాల్లో ఉమ్మడి పార్టీల నాయకులు, కార్యకర్తలు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ఆడికృత్తిక వేడుకలు

పలమనేరు, జూలై 29, ప్రభాతవార్త:



పలమనేరులో ఆడికృత్తిక వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. పట్టణంలోని మున్సిపల్ పరిధిలోని టీఎస్ అగ్రహారంలో వెలసి ఉండు సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో ఆడికృత్తిక వేడుకలు వైభవంగా జరిగాయి. ఈ వేడుకలకు పలమనేరు ఎమ్మెల్యే అమరనాథరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయంలో నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమాలలో భాగంగా ఆలయ అర్చకులు, కమిటీ సభ్యులు ఆయనకు తీర్థ ప్రసాదాలను అందించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌బిసి కుట్టి, సుబ్రమణ్యం గౌడ్, ఖాజా పీర్, నాగరాజు, శ్రీధర్, అమరనాధ్ రెడ్డి పలువురు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## తహసీల్దార్ సురేష్ బాబుకు ఘన వీడ్కోలు

వి.కోట, జూలై 29, ప్రభాతవార్త:

మండలంలో సార్వత్రిక ఎన్నికల సందర్భంగా వి.కోట తహసీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించిన తహసీల్దార్ సురేష్‌బాబుకు సోమవారం కార్యాలయ సిబ్బంది ఘనంగా వీడ్కోలు తెలిపారు. అనంతపురం జిల్లా నుండి ఎన్నికల కమీషన్ ఆదేశాల మేరకు వి.కోట మండల తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టిన ఆయన అతి తక్కువ సమయంలో అటు ఎన్నికల పనులో కీలకంగా వ్యవహరిస్తు ఇటు మండలంలోని సమస్యల పరిష్కారానికి కృషి చేశారని ఆయన సేవలను కార్యాలయ సిబ్బంది కొనియాడారు. ఈ మేరకు ఆయనకు పూలమాలలు వేసి ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ బాలాజీరావ్, ఆర్ఐ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## దేశం కార్యకర్త మృతి.. ఆర్థికసాయం

రామకుప్పం, జూలై 29 ప్రభాతవార్త

మండలంలోని గెర్నిపల్లికి చెందిన తెదేపా కార్యకర్త మురళి అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో తెదేపా నేతలు ఆయన మృతి పట్ల సంతాపం వ్యక్తం చేసి నివాళులు అర్పించారు. పార్టీ తరపున పదివేల రూపాయల ఆర్థికసాయాన్ని కార్యకర్త కుటుంబానికి అందజేశారు. కార్యక్రమంలో సుధాకర్‌రెడ్డి, సలాం, హైదర్, రఫీ, హరీష్, వెంకటేష్, కృష్ణకాంత్ పాల్గొన్నారు.

# గూడూరు డివిజన్

గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి నియోజకవర్గాలు

## సమస్యలకు త్వరితగతిన పరిష్కారం : కౌన్సిలర్ శంకరయ్య

వెంకటగిరి, జులై 29, ప్రభాతవార్త



గ్రీవెన్స్ డేలో సమస్యలపై ప్రజలు ఇచ్చిన వినతిపత్రాలను పరిశీలించి పరిష్కరిస్తారని కౌన్సిలర్ ఆరి శంకరయ్య తెలిపారు. సుదర్శన్ నగర్ సచివాలయ పరిధిలో ప్రజల సమస్యల మీద గ్రీవెన్స్ డే నిర్వహించారు. ఇందులో భాగంగా అక్కడ ఉన్న స్థానిక ప్రజలు బొగ్గులమెట్ట ధర్మాపురం, నరసింహారావు వీధి ముత్తరాశిపాలెం ప్రజలు తమ సమస్యల మీద సచివాలయం వచ్చి వినతి ప్రతాలు అందజేశారు. ప్రధానంగా సైడ్ కాలువలు, వీధి లైట్లు, పారిశుద్ధ్యం సరిగాలేదని అంతేకాకుండా సిసి రోడ్లు కావాలని కోరారు. ఈ సమస్యలను శాసనసభ్యులైనా కురుగొండ్ల రామకృష్ణకు తెలియజేసి తగు సమస్యలను పరిష్కరిస్తానని చెప్పారు. వీటికి సంబంధించి ప్రజలు ఎటువంటి ఆందోళనకు గురికాకుండా ప్రజలకు ఉన్న సమస్యలను ప్రతి సోమవారం అర్జీలను సచివాలయం నందు స్వీకరిస్తానని తెలిపారు.

## ఘనంగా ఆడికృత్తిక మహోత్సవ వేడుకలు

వెంకటగిరి, జులై 29, ప్రభాతవార్త



పట్టణంలోని రామలింగేశ్వర స్వామి దేవాలయం ప్రాంతంలో వెలసిన షణ్ముఖ సుబ్రమణ్య స్వామి ఆలయంలో ఘనంగా ఆడికృతిక వేడుకలు జరిగాయి. స్వామి వారి కల్యాణోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. షణ్ముఖ సుబ్రమణ్య స్వామికి ఘనంగా కళ్యాణం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు నిర్వహించారు. శివలింగాలకు ప్రత్యేక పూజలను నిర్వహించారు. వైభవంగా ఆడికృత్తిక వేడుకలు నిర్వహించారు.

## కామ్రేడ్ జనార్దన్ రెడ్డి సేవలు ఎనలేనివి

గూడూరు, జులై 29, ప్రభాతవార్త



కామ్రేడ్ ఇందుకూరు జనార్ధన్ రెడ్డి పార్టీకి చేసిన సేవలు ఎనలేనివని సిపిఎం నాయకులు వెంకటరామిరెడ్డి తదితరులు కొనియాడారు. గూడూరు పట్టణంలోని సిపిఎం పార్టీ కార్యాలయంలో జనార్ధన్ రెడ్డి పదో వర్ధంతి వేడుకలు పట్టణ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూల మాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కామ్రేడ్ ఇందుకూరు జనార్ధన్ రెడ్డి తన తుది శ్వాస వరకు పేదల పక్షాన పోరాటం చేశారన్నారు. ఆయన పార్టీకి చేసిన సేవలు మరువలేనివి అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు బిల్డింగ్ వర్కర్స్ నాయకులు పుట్ట శంకరయ్య, సిఐటియు నియోజకవర్గ కార్యదర్శి శ్రీనివాసులు, పట్టణ కార్యదర్శి సురేష్, పామంజి మణి, నరసింహులు, చంద్రయ్య, వెంకట్ రావు తదితరులు పాల్గొన్నారు.

## చేనేత కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలి

### సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ప్రభాకర్

వెంకటగిరి, జులై 29, ప్రభాతవార్త




చేనేత కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ప్రభాకర్ పేర్కొన్నారు. సోమవారం చేనేత కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు గూడూరు పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద సిపిఐ, ఏఐటియుసి, చేనేత కార్మిక సంఘాల ఆధ్వర్యంలో సోమవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. అనంతరం నాయకులు ఆర్డివో కిరణ్ కుమార్‌కు వినతి పత్రం అందజేసి సమస్యలు పరిష్కరించాలని వివరించారు. సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ప్రభాకర్ మాట్లాడుతూ చేనేత సహకార సంఘాలకు పాలక వర్గ ఎన్నికలు నిర్వహించాలన్నారు. చేనేత సహకార సంఘాలకు ప్రభుత్వం చెల్లించాల్సిన బకాయిలు వెంటనే చెల్లించాలని కోరారు. సిల్క్ రాయితీని రెండు వేల నుండి మూడు వేల రూపాయిలకు పెంచి ఇవ్వాలని, ముద్రా రుణాలు ఇచ్చిన ప్రతిసారి సబ్సీడి ఇవ్వాలంటూ వారు డిమాండ్ చేశారు. అనంతరం సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి శశి, పట్టణ కార్యదర్శి కాలేషాలు మాట్లాడుతూ చేనేత వస్త్ర ఉత్పత్తులకు ప్రభుత్వం మార్కెటింగ్ సౌకర్యం కల్పించాలన్నారు. ఆదరణ పథకాన్ని పునరుద్ధరించి సబ్సీడితో వృత్తి పరికరాలను చేనేతలకు అందించాలన్నారు. 11 రకాల చేనేత వస్త్ర ఉత్పత్తుల రిజర్వేషన్ చట్టాన్ని అమలు చేయాలన్నారు. చేనేతలకు ప్రత్యేక బ్యాంకులు ఏర్పాటు చేసి, సబ్సీడీ రుణాలను పంపిణీ చేయాలన్నారు. ప్రభుత్వం చేనేత కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. ఎఐటియుసి నియోజకవర్గ అధ్యక్షులు ఎంబేటి చంద్రయ్య, కార్యదర్శి నారాయణ, చేనేత కార్మిక నాయకులు భాస్కర్, కోటయ్య, యశోదమ్మ తదితరులు పాల్గొన్నారు.

## గ్రీవెన్స్ సెల్‌లకు 5 అర్జీలు

వాకాడు, జులై 29, ప్రభాతవార్త



మండల తహశీల్దార్ కార్యాలయంలోని సోమవారం తహశీల్దార్ నరసింహారావు ఆధ్వర్యంలో గ్రీవెన్స్ సెల్ నిర్వహించారు. మండలంలోని ఇంటి స్థలాల కోసం, పాసుబుక్కులు కోసం అర్జీలు వచ్చాయని తహశీల్దార్ నరసింహారావు తెలిపారు. అర్హులైన వారికి ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఇంటి స్థలాలు ఇవ్వడం జరుగుతుందన్నారు. అదే విధంగా భూమికి సంబంధించిన అన్ని దరఖాస్తులతో వచ్చిన వారికి పాస్ బుక్‌లు వెంటనే చేయడం జరుగుతుందన్నారు. మండలంలోని వివిధ సమస్యలపై వచ్చిన దరఖాస్తులను సంబంధించిన అధికారుల ద్వారా పరిష్కరించడం జరుగుతుందన్నారు. ఆర్ఐ సెల్వరాజ్, సిబ్బంది తదితరులు ఉన్నారు.

## కుష్టు వ్యాధిపై అవగాహన

కోట, జూలై 29 ప్రభాతవార్త



కోట మండలం చిట్టేడు ఎస్టీ గురుకుల పాఠశాలలో కుష్టు వ్యాధిపై డాక్టర్ నాగరాజు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చర్మం మీద స్పర్శ లేని మచ్చలు ఉంటే వాటిని గుర్తించి ఆ వివరాలను ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పరీక్ష చేయించి, వాటికి సంబంధించిన చికిత్స అందజేస్తామని తెలిపారు. దీని కోసం వివిధ ప్రభుత్వ శాఖల సమన్వయంతో పనిచేస్తున్నట్లు పేర్కొన్నారు. ఇళ్లలో ఎవరికైనా కుష్టు వ్యాధి ఉన్నట్లయితే నిర్లక్ష్యం చేయకుండా సమీప వైద్యశాలలకు వెళ్లి డాక్టర్ల వద్ద పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఇలా విద్యార్థులకు అవగాహన కల్పిస్తే ఇళ్లలో తల్లిదండ్రులకు చెబుతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆశా, ఎఎన్ఎం కార్యకర్తలు పాల్గొన్నారు.

## జోరు వర్షం.. తడిసి ముద్దైన కోట

కోట, జూలై 29 ప్రభాతవార్త

కోటలో సోమవారం సాయంత్రం జోరుగా వర్షం కురిసింది. పాఠశాలలు, కళాశాలలు వదిలే సమయం కావడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. తడుస్తూనే ఇళ్లకు వెళ్లారు. వివిధ పనులు నిమిత్తం బయటకు వచ్చినవారు, కార్యాలయాల నుంచి ఇళ్లకు వేళ్లే వారు వాహనదారులు నానా అవస్థ పడ్డారు. కోటలో జోరు ముంచెత్తడంతో వాహనదారులకు ఇబ్బందులు తప్పలేదు. ద్విచక్ర వాహనదారులు రోడ్డు దాటలేక పోయారు.

## మినీ గోకులాల ఏర్పాటుకు పచ్చజెండా

### - పాడి రైతుల ఆనందం

కోట, జూలై 29 ప్రభాతవార్త

పాడి పరిశ్రమకు పూర్వవైభవం తీసుకురావడానికి రాష్ట్రప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. మినీ గోకులాల నిర్మాణానికి అనుమతి ఇచ్చింది. పశు పోషకులకు 90 శాతం, కోళ్ల పెంపకందారులకు 70 శాతం మేరకు రాయితీ ఇవ్వాలని నిర్ణయించింది. గొర్రెలు, మేకలకు సంబంధించి 30 శాతం వాటా లబ్ధిదారులు భరించాలి. ఈ మేరకు పశుసంవర్ధక శాఖ ఉన్నతాధికారులు మార్గదర్శకాలు జారీ చేశారు. ఉపాధి హామీ పథకం నుంచి నిధులు రాబట్టాలని సూచనలు చేశారు. ఎండ వానల సమయంలో చాలాచోట్ల మూగజీవాలు బయట ఉండిపోతున్నాయి. తగిన రక్షణ లేక వ్యాధుల బారిన పడి మృతిచెందుతున్నాయి. గతంలో తెలుగుదేశం ప్రభుత్వం హయాంలో మినీ గోకులాలు ఏర్పాటుకు 2018లో ఉత్తర్వులు జారీ అయ్యాయి. దీని కింద షెడ్ల నిర్మాణం పనులు చేపట్టినా వారికి బిల్లులు చెల్లించే సమయంలో 2019లో ఎన్నికలు నగారా మోగడంతో సొమ్ము అందలేదు. అనంతరం వైసీపీ అధికారంలోకి రావడంతో లబ్ధిదారులను పట్టించుకోలేదు. షెడ్లు ఏర్పాటుకు ముందుకొచ్చే వారి నుంచి దరఖాస్తులు స్వీకరించాలని ఇటీవల కూటమి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. తొలివిడత మండలాల వారీగా యూనిట్లు ఇవ్వాలని అధికారులు లక్ష్యం పెట్టుకున్నారు. ఇందుకు ఉపాధి హామీ పథకం నుంచి నిధులు మంజూరు చేయనున్నారు. సొంత స్థలం కలిగిన చిన్న, సన్నకారు ఎస్సీ, ఎస్టీ రైతులకు ప్రాధాన్యత ఇవ్వనున్నారు.

## కోట ఆస్పత్రికి పెరిగిన రోగుల తాకిడి

కోట, జూలై 29 ప్రభాతవార్త

కోటలోని మూపై పడకల ప్రభుత్వ ఆస్పత్రికి రోగులు తాకిడి పెరిగింది. జ్వరాలు, జలుబు, దగ్గు, తదితర రోగాలతో ప్రజలు సతమతవుతూ ఆస్పత్రిని ఆశ్రయిస్తున్నారు. సోమవారం ఆస్పత్రిలోని ఔట్ పేషెంట్ విభాగంలో ఓపిలో నమోదు కోసం రోగులు బారులు తీరారు. నిత్యం వందలాది మంది రోగులు ఆ ఆస్పత్రికి వస్తున్నారు. కోట, వాకాడు, చిట్టమూరు మండలాలకు వ్యాపారం కూడాలిగా ఉండటంతో వివిధ పనులు పై కోటకు వస్తుంటారు. ఈ క్రమంలో ఆస్పత్రికి వచ్చి తమ రోగాలను వైద్యులు కు చూపించుకుని వెళ్లుతుంటారు. ఇక్కడ వైద్య సేవలు బాగ అందుతుండటంతో ప్రజలు ప్రైవేట వైద్యం కోరుకు వెళ్లడం మానేశారు. 90 శాతం అన్ని వర్గాల ప్రజలు కోట ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యులు, ప్రముఖ డాక్టర్, రూప, పి.డి.రావు మునిశేఖర్ రెడ్డి, రాజశేఖర్, ఇతర యువ వైద్యులు ప్రజలకు మంచిగా సేవలు అందించడంతో ఈ కోట ఆస్పత్రికి మంచి పేరు వచ్చింది. దీంతో నిత్యం రోగులతో ఈ ఆస్పత్రి కిటకిటలాడుతోంది. అన్ని రకాల వైద్య పరీక్షలు ఉచితంగా చేస్తుండంతోపాటు ప్రజలతో బాగ మమేకమై సేవలు అందిస్తున్నారు. గత రెండు సంవత్సరాల నుంచి ఇక్కడ డాక్టర్లు ప్రజలకు వైద్యం బాగ చేస్తున్నారని, పలువురు ప్రజలు తెలిపారు. ఎప్పుడు ఆస్పత్రికి వచ్చిన అందుబాటులో ఉంటూ సేవలు అందిస్తున్నారని కోట కు చెందిన ప్రజలు చెప్పారు.

## 31న మున్సిపల్ సమావేశం

వెంకటగిరి, జులై 29, ప్రభాతవార్త

ఈ నెల 31వ తేదీ మున్సిపల్ కౌన్సిల్ సమావేశం చైర్ పర్సన్ నక్క భానుప్రియ అధ్యక్షతన జరుగుతుందని కమిషనర్ అబ్దుల్ నజీర్ తెలిపారు. సమావేశాల్లో కులాంశాలు చర్చిస్తారని చెప్పారు. కౌన్సిలర్లు, అధికారులు సమావేశానికి హాజరు కావాలని కోరారు.

# తిరుపతి డివిజన్

## రామగిరి గొప్ప ఆధ్యాత్మిక కేంద్రంగా విరాజిల్లాలి

### -స్వామి ఆడికృత్తిక పూజల్లో ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం



పిచ్చాటూరు, జూలై 29 ప్రభాతవార్త: పల్లవుల కాలంనాటి సుప్రసిద్ధ దేవాలయాలకు నిలయమైన రామగిరి గొప్ప ఆధ్యాత్మిక, పర్యాటక కేంద్రాలుగా విరాజిల్లాలని సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం ఆకాంక్షించారు. సోమవారం ఆడికృత్తిక పర్వదినాన్ని పురస్కరించుకుని రామగిరిలోని శ్రీ సుబ్రహ్మణ్యస్వామి, శ్రీ వాలీశ్వర స్వామి, కాలభైరవ స్వాములను క్లస్టర్ ఇన్‌చార్జి ఇళంగోవన్‌రెడ్డితో కలసి ఎమ్మెల్యే దర్శించుకున్నారు. అంతకు ముందు ఎమ్మెల్యే ఆలయ ప్రాంగణంలోని నంది పుష్కరిణీని సందర్శించి నందీశ్వరుని ఆశీర్వాదం పొందారు. అనంతరం భక్తులకు అత్యవసర సమయాల్లో చికిత్స నిమిత్తం ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే సందర్శించారు. రామగిరి పలు ప్రాచీన పుణ్యక్షేత్రాలకు నిలయంగా ఉన్నట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఆలయానికి అనుబంధంగా ఉన్న శ్రీ అంకాళపరమేశ్వరి అమ్మవారి ఆలయంలో ప్రతి అమావాస్య, ప్రతి పౌర్ణమి దినాల్లో అశేష భక్తుల నడుమ అమ్మవారి ఊంజల్ వేడుకగా నిర్వహిస్తారని ఎమ్మెల్యే వివరించారు. ఇంతటి గొప్ప ఆలయాలు నిలయమైన రామగిరి ఆధ్యాత్మిక, పర్యాటక కేంద్రాలుగా తీర్చిదిద్దడానికి రూ.3 కోట్ల ప్రతిపాదనలు సిద్ధం చేసి నిధులు మంజూరు కోసం ప్రతిపాదన ప్రభుత్వం వద్ద ఉన్నట్లు ఎమ్మెల్యే వెల్లడించారు. రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సహకారంతో నిధులు మంజూరు చేయించి ఇక్కడి ఆలయాలను ఆధ్యాత్మిక, పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతానని ఎమ్మెల్యే స్పష్టం చేశారు.

**శ్రీ దక్షిణామూర్తి స్వామికి గేట్లు తెరవండి:**

ఈ సందర్భంగా పిచ్చాటూరు మాజీ జడ్పీటీసీ సభ్యులు సుమాంజలి శ్రీ వాలీశ్వర స్వామి గర్భగుడి ప్రాకారంతో కొలువుదీరిన శ్రీ దక్షిణామూర్తి స్వామివారికి గేట్లు వేసి మూసి ఉంచారని, గేట్లు తెరిచి భక్తులు నేతి దీపాలు వెలిగించే అవకాశం కల్పించాలని ఎమ్మెల్యేకు విన్నవించారు. స్పందించిన ఎమ్మెల్యే అక్కడే ఉన్న ఆలయ ఈవో లతను వివరణ కోరగా అర్చకులు కొరత కారణంగా ఈ సమస్య తలెత్తిందని, త్వరలో పరిష్కరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**భక్తిశ్రద్ధలతో శ్రీ సుబ్రహ్మణ్యస్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు**

మండలంలోని రామగిరిలోని శ్రీ సుబ్రహ్మణ్యస్వామివారికి ఆడికృత్తిక సందర్భంగా అభిషేకాలు, పూజలు నిర్వహించారు. స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, పంచామృత అభిషేకాలు, వివిధ సుగంధ ద్రవ్యాలతో పూజలు చేశారు. భక్తులు కావళ్ళతో మొక్కులు చెల్లించారు. భక్తులతో ఆలయం కిక్కిరిసింది. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రత్యేకంగా ఏర్పాటు చేశారు.

## నేటికి వైకాపా దాడులు కొనసాగుతున్నాయి

### పచ్చికాపలం బాధితుల ఆరోపణ

తిరుపతి హెల్త్, జులై 29 ప్రభాతవార్త : టిడిపికి అనుకూలంగా ఉన్నానన్న కుట్రతో తనపై వైసిపి గుండాలు మునిరాజ్, తరుణ్, పవన్ కళ్యాణ్, శేఖర్, మోహన్, రవి, పవన్, షేక్ రఫీ తదితరులు గంజాయి సేవించి తనను ఈ నెల 25వ తేది ఆటో నడుపుకుంటున్న తనపై విచక్షణారహితంగా దాడి చేశారని, దీంతో నా ఎడమ కన్నును కోల్పోయి జీవచ్ఛవంలా పడి ఉన్నానని బాధితుడు పచ్చికాపలం వద్దనున్న చౌడేపల్లికి చెందిన ఆటో డ్రైవర్ జగదీష్ కుమార్ ఆదేదన వ్యక్తం చేశారు. తిరుపతి ప్రెస్ క్లబ్ సోమవారం సమావేశంలో మాట్లాడుతూ జగదీష్‌కు సంబంధించిన లాయర్ యండమూరి శరవన్ కుమార్, హేమలత, అమృత్ లీలాకుమార్, తదితరులతో కలిసి జగదీష్ మాట్లాడుతూ వైసిపి దాడులు ఇంకా కొనసాగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. 18 నుండి 23 సంవత్సరాలలోపు వారే తనపై దాడి చేసినట్లు సంబంధిత సిసి ఫుటేజీలు మీడియాకు చూపించారు. తాను అధికారులకు ఫిర్యాదు చేసిన ఫలితం లేదని మీడియా ముందు మొరపెట్టుకున్నారు. తక్షణం న్యాయం జరగాలని కోరారు.

## నాపై చేసిన ఆరోపణలను ఖండిస్తున్నా గండికోట

తిరుపతి హెల్త్, జులై 29 ప్రభాతవార్త : డిఎంహెచ్ఓ డాక్టర్ శ్రీహరి మా పై చేసిన ఆరోపణలను ఖండిస్తున్నట్లు సమతా సైనిక్ దళ్ జిల్లా కమిటీ సభ్యులు గండికోట సుబ్రమణ్యం తెలియజేశారు. తిరుపతి ప్రెస్ క్లబ్‌లో సోమవారం మీడియా ముందు సమతా సైనిక్ దళ్ సభ్యులు మోహన్ రాజ్, నాగార్జున, నాగేంద్ర, రమణ, వరుణ్, లాలూ ప్రసాద్ తదితరులతో కలిసి గండికోట సుబ్రమణ్యం మాట్లాడుతూ డాక్టర్ శ్రీహరిని తాను డబ్బులు డిమాండ్ చేశానంటూ తనపై వీడియో క్లిప్పింగ్స్‌తో విడుదల చేసిన వన్నీ అబద్ధాలంటూ ఖండించారు. తనను టార్గెట్ చేసి కావాలనే కుట్రతో ఓ పథకం ప్రకారం శ్రీవారి ప్లాన్ చేశారన్నారు. తమ ఇద్దరి మధ్య జరిగిన వవాస్తవాల వీడియో, సిసి కెమెరాల క్లిప్పింగ్స్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రెస్ క్లబ్‌కి మరోసారి తాను వస్తానని శ్రీహరి నిజ స్వరూపాన్ని, దుర్మార్గాన్ని బహిర్గతం చేస్తానని హెచ్చరించారు. శ్రీ హరి సన్నితులందరిని తాను కలిశానని ప్రతి ఒక్కరూ శ్రీ హరి చెడ్డవాడనే తెలియజేశారని స్పష్టం చేశారు.

## అధిక వడ్డీలు కట్టలేక చావుకు సిద్ధపడ్డా : కొర్లగుంట నివాసి గాయత్రి

తిరుపతి హెల్త్, జులై 29, ప్రభాతవార్త : కొర్లగుంట, పాత పోస్ట్ ఆఫీస్ వీధి, విజ్ఞాన్ పబ్లిక్ స్కూల్ వద్ద నివాసముంటున్న తాను మెప్మా ఆర్పిగా పనిచేస్తున్న హేమలత వద్ద ఐదు లక్షలు తీసుకున్న పాపానికి వడ్డీలకు వడ్డీలు వారం వడ్డీలు వేసి 40 లక్షల వరకు తన వద్ద వసూలు చేసిందని ఇంకా ఇవ్వాలంటూ తన పై దాడులు సైతం చేయిస్తున్నదని బాధితురాలు గాయత్రి గత బాధితురాలు మునీశ్వరిలు ఆరోపించారు. తిరుపతి ప్రెస్ క్లబ్‌లో సోమవారం మీడియా ముందు వారు మాట్లాడుతూ తమలా ఎందరో బాధితులు ఉన్నారన్నారు. తాము మున్సిపల్ ఎస్పి కార్యాలయాల్లో స్పందనలకు ఫిర్యాదు చేసినా అక్కడ హేమలత మాకన్నా ముందు వెళ్లి మేనేజ్ చేస్తున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. హేమలతకు పొలిటికల్ బ్యాక్ గ్రౌండ్ ఉందని తెలిపారు. ఆమె నుండి తమకు విముక్తి కావాలని మీడియా ముందు అధికారులకు విజ్ఞప్తి చేశారు.

## వైసిపి పాలనలో గుడి బడి ఏ శాఖను వదలకుండా దోచేశారు

### -జనసేన నేత కిరణ్ రాయల్ డిమాండ్

తిరుపతి హెల్త్, జులై 29 ప్రభాతవార్త : వైసిపి పాలనలో గుడి, బడి ఇతరత్రా ఏ శాఖను వదలకుండా మొత్తం దోచేశారని జనసేన పార్టీ తిరుపతి ఇన్చార్జి కిరణ్ రాయల్ ఆరోపించారు. తిరుపతి ప్రెస్ క్లబ్‌లో సోమవారం మీడియా ముందు వారు మాట్లాడుతూ ప్రధానంగా ప్రపంచంలోనే ప్రసిద్ధిగాంచిన శ్రీవారి పుణ్యక్షేత్రం తిరుమల టిటిడి వెహికిల్స్‌ను వారి సొంత స్వలాభాలకు వాడుకున్నారని దుయ్యబట్టారు. టిడిపి ట్రాన్స్పోర్ట్ అధికారిగా ఈ అనకొండతో పాటు మరొక సూపరింటెండెంట్ ఎందరో జేఈఓలు, ఈవోలు, చైర్మన్లు మారినా వీరద్దరూ ఇక్కడే ఎంతో కాలంగా పాతుకుపోయి ఉన్నారన్నారు. ఈ పోస్టులోకి రాకముందు వీరి ఆస్తులు ఎంత నేటి ఆస్తులు ఎంత విచారించి వీరిని తక్షణం బదిలీ చేయాలన్నారు. శ్రీవారి వాహనాలను వారి ప్యామిలీ కోసం, సూపర్ మార్కెట్‌కు, సినిమా హాల్స్‌కు, షాపింగ్‌లకు అంతకుమించి రాత్రుల్లో వారి సుపుత్రుల కారు రేసులకు దుర్వినియోగం చేయడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. వీరి అవినీతిని విచారించి శిక్షించాలన్నారు. తిరుమలతో గత ఎమ్మెల్యే సహకారంతో తట్టల వ్యాపారాలు విచ్చలవిడిగా వెలిశాయన్నారు. కొండపై వ్యాపారాల పేరుతో సొమ్ము చేసుకోవడం, వారికి రెవెన్యూ అధికారులు సహకరించడం, ఇలాంటి ఎన్నో వాటికి తమ వద్ద పూర్తి సాక్షాధారాలు ఉన్నాయని తెలియజేశారు. వాటన్నిటికీ సంబంధించిన ఆధారాలు తమ వద్ద ఉన్నాయని పేర్కొన్నారు. వీటిన్నిటిపై అదనపు ఈవో వెంకయ్య చౌదరిని కలిసి సోమవారం ఫిర్యాదు చేశామని, తక్షణమే ఆయన ప్రక్షాళన చేస్తామని హామీ ఇచ్చారని కిరణ్ తెలిపారు. ఈ మీడియా సమావేశంలో ఆకేపాటి సుభాషిని, హేమ కుమార్, మనోజ్, కిషోర్, ఆది, సాయి దేవ్, దుర్గ, భానులు పాల్గొన్నారు.

## దేశం నాయకులపై దౌర్జన్యాలుచేస్తే సహించేది లేదు

తొట్టంబేడు, జులై 29 ప్రభాతవార్త : నియోజకవర్గంలోని తొట్టంబేడు మండలంలోని గుండేలిగుంట పంచాయతీ కొత్తకండ్రిగ హరిజనవాడలో గత ఐదు సంవత్సరాలుగా వైసిపి నాయకులు చేసిన దాడులు, కేసులు కో కొల్లలుగా ఉన్నాయని అయినా అన్ని కేసులను భరించి కోర్టులకు తిరుతున్న సమయంలో తెలుగుదేశంపారక్టు అధికారంలోకి వచ్చిన తర్వాత ఆపంచాయతీలో అత్యధిక మెజారిటీ సుధీర్‌రెడ్డికి వచ్చినందున వైసిపి పార్టీ నాయకులు కక్షకట్టి శనివారం రాత్రి ఒంటరిగా ఉన్న సురేష్, ఆతని భార్యపై మూకుమ్మడి దాడిచేసి కత్తులు, రాడ్లతో అత్యంత కిరాతకంగా తలమీద కొట్టి మహిళ అని కూడా చూడకుండా పళ్ళురాలపోయే విధంగా దాడులు చేయడం శోచనీయం అని మండల తెలుగుదేశంపార్టీ అధ్యక్షుడు గాలిమురళీనాయుడు హెచ్చరించారు. దాడిచేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆస్పత్రిలో చికిత్స పొందిన వారికి పరామర్శించి వైద్యులకు గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించాలని కోరారు. కార్యక్రమంలో బిజెపి మండల పార్టీ అధ్యక్షులు కృష్ణయ్య, సునీల్, సుబ్రమణ్యం, సన్నీ తదితరులు పాల్గొన్నారు.

## నూతన కార్యవర్గం ఎన్నిక

తొట్టంబేడు, జూలై 29 ప్రభాతవార్త : శ్రీకాళహస్తి డివిజన్‌లో ఏపి పంచాయతీరాజ్ సర్వీసెస్ అసోసియేషన్ రాష్ట్ర ట్రెజరర్ బి.ప్రభుదేవారెడ్డి ఆధ్వర్యంలో డివిజనల్ పంచాయతీ కార్యాలయంలో ఉమ్మడి చిత్తూరు జిల్లా కార్యనిర్వాహక కమిటీని ఎంపిక చేశారు. ఈ కార్యవర్గాన్ని రాయలసీమజోన్ ప్రధాన కార్యదర్శి కందుకూరి ఆనందబాబు ఎన్నికల అధికారిగా వ్యవహరించారు. అనంతరం నూతనంగా ఏకగ్రీవంగా ఎన్నికైన కార్యవర్గాన్ని ప్రకటించారు. రాష్ట్ర ట్రెజరల్ బి.ప్రభురెడ్డి, రాష్ట్ర వైస్ చైర్మన్ మరియు ఎన్నికల అధికారిగా వ్యవహరించిన ఆనందబాబు ఎన్నికలుజరిపి నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు. ఈసందర్భంగా నూతన కార్యవర్గానికి పలువురు శుభాకాంక్షలు తెలిపారు.

# సమన్వయంతోనే ప్రశాంతంగా ఆడికృత్తిక ఉత్సవాలు



శ్రీకాళహస్తి, జూలై 29 ప్రభాతవార్త : ఆడికృత్తిక మహోత్సవాల సందర్భంగా విజ్ఞానగిరిపై వెలసి ఉన్న కుమారస్వామిని దర్శించుకోవటానికి వచ్చిన భక్తులకు సత్వర దర్శనం, సుదర్శనం కోసం రూపకల్పన చేసిన క్యూలైన్లు చక్కగా ఉన్నాయి. దేవస్థానంకు అధికారులకు మంచి పేరు రావాలంటే అధికారులు, సిబ్బంది సమన్వయంతో పని చేయాలని ఇతర శాఖల అధికారుల సహకారం ఎంతో అవసరం అని భావించిన ఇఒ ఎన్వియస్ఎన్ మూర్తి అన్నిశాఖలతో సమన్వయంతో పని చేశారు. ప్రభుత్వం చేపట్టిన బదిలీల్లో ఇఒ, పోలీసు అధికారులు నూతనంగా వచ్చారు. వారి పర్యవేక్షణలో జరిగిన ధర్మరాజుల ఉత్సవాల్లో అగ్నిగుండం మహోత్సవం సందర్భంగా నేడు ఆడికృత్తిక సందర్భంగా పోలీసుల సేవలు ప్రశంసనీయమని పలువురు అభినందించారు. ఉదయం 10 గంటల నుంచి చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు పలచగా వచ్చారు. కారణం 'ఆడికృత్తిక ఘడియలు మధ్యాహ్నం నుంచి రావటంతో భక్తులు మధ్యాహ్నం నుంచి తరలి వచ్చారు. ఈ సందర్భంగా సిఐ నరసింహారావు, డివైయస్పి ఉమామహేశ్వ రరెడ్డి సూచనలతో రూపకల్పన చేసిన ట్రాఫిక్ రూపకల్పన సత్ఫలితాలిచ్చాయని అభినందించారు. డివైయస్పి ఉమామహేశ్వరరెడ్డి పర్యవేక్షణలో సిఐ నరసింహారావు వారి సిబ్బంది సేవలు అభినందిం చదగింది. వేకువ జాము నుంచే పోలీసులు బందోబస్తు వచ్చారు. వేలాది మంది వచ్చినా ఎక్కడా ఆగకుండా క్యూలైన్లు రూపకల్పన చేశారన్నారు. అంతేకాక ఆలయ సిబ్బంది సేవలు అభినంద నీయం ఎక్కడా దర్శనాలకు ఇబ్బంది లేకుండా దర్శనానికి వచ్చే భక్తులు ఓ మార్గంలో బయటకు వెళ్ళు భక్తులు మరో మార్గంలో ఏర్పాటు చేశారన్నారు. ఇఒ వికె ఎన్వియస్ఎన్ మూర్తి మాట్లాడుతూ 'సామాన్య భక్తులకు సుదర్శనమే ప్రధాన అజెండాగా క్యూలైన్లు రూపకల్పన చేశామన్నారు.' సుమారు 40వేల మంది భక్తులు వచ్చినా ఎక్కడా ఇబ్బంది లేకుండా దర్శనభాగ్యం కల్పించామన్నారు. ఇక తెప్పోత్సవాన్ని కూడా అంగరంగవైభవంగా నిర్వహించుటకు చర్యలు తీసుకు న్నామన్నారు. తలనీలాలు సమర్పించుకొను భక్తులకు నీటి సదుపాయాన్ని కల్పించటంలో ఇంజనీరింగ్ డిఇఇ శ్రీనివాసులురెడ్డి వారి సిబ్బంది చొరవ ప్రశంసనీయం అన్నారు. ముఖ్యంగా క్యూలైన్ల రూప కల్పనలో పోలీసులు సహకరించారని అయన అభిప్రాయపడ్డారు. ఉదయం నుంచి రాత్రి వరకు ఆలయ డెప్యూటి ఇఒ ఎస్ ఆర్ కృష్ణారెడ్డి, డిఇఇ శ్రీనివాసులురెడ్డి, ఎలక్ట్రిషియన్ ఎఇఇ మురళి, శానిటరీ ఇన్స్పెక్టర్ వెంకటస్వామి, ఎసి మల్లికార్జున్ ప్రసాద్, సూపరింటెండెంట్‌లు లోకేష్‌రెడ్డి, నాగభూషణం యాదవ్‌ఆలయం వద్దనే తిష్టవేసి వచ్చిన భక్తులకు ఇబ్బంది లేకుండా పంపారు. పట్టణ ప్రముఖులు కూడా ఎం చక్కా క్యూలైన్లలోనే వచ్చారు. ఆలయం వద్ద మాత్రం పోలీసులు విఐపి క్యూ అని బోర్డు ఏర్పాటు చేసి అనుమతించారు.

**పోలీసుల భారీ బందోబస్తు :**

ఆడికృత్తిక మహోత్సవాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు భారీ బందోబస్తును ఏర్పాటు చేశారు. డివిజన్‌లోని పోలీసులతోనే డివైయస్పి ఉమామహేశ్వరరెడ్డి, సిఐ నరసింహారావు పకడ్బందీగా ప్రణాళికలు రూపొందించి అమలు చేశారు. ఆలయ సిబ్బంది క్యూలైన్ల వద్ద భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలుతీసుకున్నారు. కొండపై దర్శనానికి వెళ్లే భక్తులు, వచ్చేభక్తులకు ఒకే దారి ఉండేది. కొన్ని సంవత్సరాలుగా ఈ విధానాలు మార్చడంతో భక్తులకు ఎలాంటి ఎలాంటి ఇబ్బందులు లేకుండా సాగుతుంది. ఇకపెండ్లిమండపం వద్ద నుంచి ట్రాఫిక్‌ను మళ్లించారు. తిరుపతి నుంచి వచ్చే బస్సులు బైపాస్‌మీదుగా బస్టాండుకుర ప్పించి, తిరుపతికి వెళ్లే బస్సులను ఆర్టీసి బస్టాండు నుంచి శివసర్కిల్, జయరామారావువీధి మీదుగా మళ్లించారు. ఇక నారదపుష్కరిణి వద్ద పలువురు పోలీసులు నిఘా ఉంచారు. కొండపై స్వామి దర్శనార్థం నిరీక్షిస్తున్న భక్తులకు స్కౌట్స్ అండ్ గైడ్స్ సేవలందించారు.

## సిపిఆర్ పై మహిళా యూనివర్శిటీలో శిక్షణ

తిరుపతి విద్య, జులై 29 ప్రభాతవార్త : మహిళా విశ్వవిద్యాలయం ఎన్ఎస్ఎస్ యూనిట్ 3, మహిళ అధ్యయన విభాగం ఆధ్వర్యంలో విద్యార్థులనులకు సిపిఆర్ ప్రక్రియపై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. వయసుతో సంబంధం లేకుండా ఈ మధ్యకాలంలో హార్ట్‌ఎటాక్ మరణాలు పెరిగిపోతున్నాయని, ఎమర్జెన్సీ సమయంలో ప్రాణాలను కాపాడే ఈ ప్రక్రియపై విద్యార్థినులకు శిక్షణ కల్పించాలనే సదుద్దేశంతో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లుగా ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారిని, మహిళా అధ్యయన విభాగ ఇన్చార్జ్ హెడ్ డా. నీరజ తెలిపారు. ఈ కార్యక్రమంలో స్విమ్స్ కార్డియాలజీ విభాగ ప్రొఫెసర్ డాక్టర్ వనజ విద్యార్థినులకు శిక్షణ అందించారు. ఆమె మాట్లాడుతూ గుండె, ఊపిరితిత్తల పనితీరు ఆకస్మికంగా ఆగిపోయినప్పుడు వాటిని పునరుద్ధరించ డానికి ఆక్సిజన్‌తో కూడిన రక్తాన్ని ప్రవహింపచేయడానికి ఉపయోగించే అత్యవసర ప్రక్రియ ఈ సిపిఆర్ అని, దీనిని అంబులెన్స్ వచ్చేలోగా ఎమర్జెన్సీ ఫస్ట్ ఎయిడ్ లాగా అందించిన ఎడలరిస్క్ తగ్గించవచ్చని చెప్పారు. గుండె పనిచేసే తీరు, హార్ట్ ఎటాక్ లక్షణాలు, ఈ సిపిఆర్ ఆవశ్యకత, దానిని ఎప్పుడు చేయాలి ఎలా చేయాలి, ఎంతసేపు చేయాలి అన్న విషయాలను వివరించి, మానికిన్ ద్వారా డెమాన్స్ట్రేషన్ చేసి చూపించి, విద్యార్థినులతో చేయించడం జరిగింది. అనస్తిషియ విభాగపు హెడ్ అండ్ ప్రొఫెసర్ డా. అలోక సమర్థరాయ్ మాట్లాడుతూ సిపిఆర్ ప్రతి ఒక్కరూ నేర్చుకో తగినటువంటి విలువైన నైపుణ్యమని అన్నారు. మన దేశంలో కేవలం 2 శాతం మంది మాత్రేమ దీనిపై అవగాహన కలిగి ఉండడం బాధాకరం అన్నారు. ఎన్ఎస్ఎస్ బ్యూరో కోఆర్డినేటర్ ప్రొ. విద్యావతి మాట్లాడుతూ ఎప్పుడు పడితే అప్పుడు ఎలా పడితే అలా సిపిఆర్ చేయకూడదని అత్యవసర వేళల్లో అది కూడా ముందుగా అంబులెన్స్‌కి ఫోన్ చేసి అంబులెన్స్ వచ్చేలోపు మాత్రమే ఈ ప్రక్రియను జాగ్రత్తగా చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నర్సింగ్ కాలేజీ అధ్యాపకులు మునిచంద్రిక, జ్యోత్స్న, స్విమ్స్ ఏహెచ్ఏఐటిసి అడ్మిన్ మధుబాబు, వివిధ విభాగాల నుండి ఆసక్తి కలిగిన విద్యార్థులు, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు.

## ఎస్వీయూ పరిపాలన భవనంలో విసి ఆకస్మిక తనిఖీ



తిరుపతి విద్య, జులై 29 ప్రభాతవార్త : శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయంలోని పరీక్షల విచారణ కేంద్రం, అకడమిక్, ఫైనాన్స్ విభాగాలను ఇంచార్జి ఉపకులపతి ఆచార్య అప్పారావు ఆకస్మికంగా సోమవారం మధ్యాహ్నం ప్రాంతంలో ఆకస్మికంగా తనిఖీ చేశారు. కొందరు ఉద్యోగులతో ఫైళ్ల వివరాలు అడిగి తెలుసుకున్నారు. హాజరు పట్టికను పరిశీలిం చారు. సంబంధిత విభాగ అధికారులకు సమయ పాలన పాటించాలని దిశానిర్దేశం చేశారు. నిబంధనలు పాటించని ఉద్యోగులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. విద్యార్థులకు సహకరిస్తూ, స్నేహభావంతో త్వరితగతిన పనులు చేయాలని అలసత్వం వహిస్తే ఉపేక్షించేది లేదని తెలిపారు.

## డే పోటీల్లో సోక్రటీస్ విద్యార్థుల ప్రతిభ



తిరుపతి విద్య, జులై 29 ప్రభాతవార్త : స్థానిక ఎస్వీ జూ పార్క్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఇంటర్నేషనల్ టైగర్స్ డే వేడుకల్లో సోమవారం బైరాగి పట్టెడులో ఉన్న సోక్రటీస్ విద్యార్థులు పాల్గొని జూపార్క్ వారు నిర్వహించిన వివిధ రకాల పోటీలలో డ్రాయింగ్, ఎస్సే రైటింగ్ పోటీలలో మొదటి, రెండవ బహుమతులు సాధించిన సోక్రటీస్ విద్యార్థులు ప్రతిభ కనపరిచిన విద్యార్థులను జూ పార్క్ జెడ్ ఈవో క్యూరేటర్ చేతుల మీదుగా బహుమతులు, సర్టిఫికేట్స్ అందుకున్నారు. ఈ సందర్భంగా బహుమతులు సాధించిన విద్యార్థులను సోక్రటీస్ పాఠశాల కరస్పాండెంట్ కె. ప్రదీప్‌రెడ్డి, పాఠశాల ఉపాధ్యాయులు, ఇతర సిబ్బంది తదితరులు అభినందించారు.

## ప్రభుత్వ విద్యా వ్యవస్థ పటిష్టతకు చర్యలు తీసుకోండి : కలెక్టర్



తిరుపతి విద్య, జులై 29 ప్రభాతవార్త : ప్రభుత్వ విద్యా వ్యవస్థ పటిష్టతకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ముఖ్యంగా ప్రభుత్వ పాటశాలల అభివృద్ధికి, విద్యా ప్రమాణాలు పెంచడానికి, విద్యార్థుల్లో నైతిక విలువలు పెంపొందిం చేందుకు చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎస్. బాలాజీ, తిరుపతి జిల్లా ప్రధాన కార్యదర్శి గట్ల సాంబ రెడ్డి, జిల్లా సహాధ్యక్షులు డా.ఎం. దేవరాజులు, గల్లా మహిళా కన్వీనర్లు లత, సౌజన్య, కల్పన, డివిజన్ కన్వీనర్ దాము తదితరులు తిరుపతి జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్‌ను కోరారు. నేడు ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం ప్రతినిధులు నూతనంగా బాధ్యతలు చేపట్టిన జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్‌ని మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు పలు విద్యారంగ, ఉపాధ్యాయ సమస్యలను వారితో చర్చించారు. ముఖ్యంగా జీవో నెంబర్ 117ను రద్దు చేయటం, మూడు నాలుగు ఐదు తరగతుల విలీనాన్ని వెనక్కు తీసుకోవడం, ఉపాధ్యాయులకు బోధనేతల పనులు లేకుండా చేయడం ప్రతి ఉన్నత పాఠశాలకు హెచ్ఎంపిడి పోస్టు మంజూరు చేయడం వంటి పలు సమస్యలు వారి దృష్టికి తీసుకెళ్లారు. జిల్లా కలెక్టర్ ఎస్. వెంకటేశన్వర్ సానుకూలంగా స్పందిస్తూ ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి, విద్యా ప్రమాణాలు పెంచడానికి ఉపాధ్యాయులు కూడా తమ వంతు బాధ్యతగా పనిచేయాలని కోరారు.

## డెవలప్మెంట్ కౌన్సిల్ డీన్‌గా చంద్రాయుడు



తిరుపతి విద్య, జులై 29 ప్రభాతవార్త : శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం కాలేజ్ డెవలప్మెంట్ కౌన్సిల్ డీన్‌గా ఎస్వీయూ జియాగ్రఫీ విభాగానికి చెందిన ఆచార్య ఎన్. చంద్రాయుడును నియమిస్తూ విశ్వవిద్యాలయ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. కాగా సోమవారం సాయంత్రం పదవీ బాధ్యతలు స్వీకరించారు.

## పోషక విలువలతో కూడిన భోజనం అవసరం : ఎంపిడిఓ



చంద్రగిరి, జులై 29 ప్రభాతవార్త: ఎదిగే పిల్లలకు పోషక విలువలతో కూడిన భోజనాన్ని అందించడం అవసరమని ఎంపిడిఓ డాక్టర్ వి.వి.సూర్యసాయి అన్నారు. స్థానిక శ్రీపద్మావతీ జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో సోమవారం శుభదిన్ భోజన్ "తిథి భోజనం" కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థినులతో కలసి సహపంక్తి భోజనం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ "శిక్ష సప్తహ" కార్యక్రమం ద్వారా వారం రోజుల పాటు దాతల సహకారంతో నిర్వహించనున్న "తిథి భోజనం" మొదటి రోజున పాఠశాల పూర్వ విద్యార్థినులు, టీచర్లు సంయుక్తంగా దాతృత్వం వహించడం పట్ల అభినందించారు. వారం రోజుల పాటు నిర్వహించనున్న తిథి భోజనం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ శ్రీవరం లలితకుమారి, ఎంఈఓ-2 భాస్కర్ బాబు, బిజెపి నాయకులు మేడసాని పురుషోత్తం నాయుడు, విరూపాక్షి నవీన్‌కుమార్ రెడ్డి, పేరెంట్స్ కమిటీ చైర్మన్ రుక్మిణి, సభ్యురాలు కాత్యాయిని, హెచ్ఎం వెంకట రమణ రెడ్డి, టీచర్లు, బోధనేతర, సిబ్బంది పాల్గొన్నారు.

## రైల్వే కాంట్రాక్టు కార్మికుల సమస్యలను పరిష్కరించండి



రేణిగుంట, జూలై 29 ప్రభాతవార్త: రేణిగుంట రైల్వేస్టేషన్‌లో పని చేస్తున్న లోడింగ్ అన్ లోడింగ్ హమాలీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలంటూ సీఐటీయూ అనుబంధ రైల్వే కాంట్రాక్టు వర్కర్స్ ఎంప్లాయిస్ యూనియన్ నేతలు సోమవారం రైల్వేస్టేషన్ ఇన్‌చార్జి జ్ఞానేంద్ర కుమార్‌కు వినతిపత్రం సమర్పించారు. సీఆర్ఎస్‌లో పని చేస్తున్న కాంట్రాక్టు కార్మికుల సమస్యల పరిష్కారం కోసం డిప్యూటీ సీఎంఈ రమేష్‌కు వినతిపత్రం అందజేశారు. దేశంలోనే అత్యధిక ఆదాయ వనరులు సమకూరు స్తున్న గూడ్స్ షెడ్ హమాలీలకు రెస్ట్ రూమ్ సౌకర్యం కల్పించాలన్నారు. వారిని రైల్వే కార్మికులుగా గుర్తించి గుర్తింపు కార్డులు అందజేయడంతో పాటు ఈఎస్ఐ, పీఎఫ్ సదుపాయాలు కల్పించి జీవో ప్రకారం జీతాలు కమలు చేయాలన్నారు. రైల్వేస్టేషన్, సీఆర్ఎస్‌లోపని చేస్తున్న మహిళా కాంట్రాక్టు కార్మికులకు భద్రత కల్పిస్తూ వేధింపులు, పని ఒత్తిడి లేకుండా చేయాలని కోరారు. వినతిపత్రాలు సమర్పించిన వారిలో జిల్లా ప్రధాన కార్యదర్శి మునిరాజా, గోవిందయ్య, మండల సీఐటీయూ కార్యదర్శి హరినాథ్, వెంకటరమణ, చంద్రకళ, మునెమ్మ, మునిలక్ష్మి తదితరులు ఉన్నారు.

## అచదువుకునే పిల్లలకు న్యాయం చేయండి : జన విజ్ఞాన వేదిక

రేణిగుంట, జూలై 29 ప్రభాతవార్త: ఎక్కడో దూర ప్రాంతాల నుంచి విద్యాభ్యాసం చేయడానికి వచ్చి రేణిగుంట బీసీ కాలనీ హాస్టల్‌లో ఆశ్రయం పొందుతున్న పేద విద్యార్థులకు న్యాయం చేయాలంటూ జన విజ్ఞాన నేతలు, విద్యా వికాస వేదిక నేతలు సోమవారం జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్‌కు వినతిపత్రం సమర్పించారు. రేణిగుంట బీసీ హాస్టల్‌లో మరుగుదొడ్లు, సెప్టిక్ ట్యాంకు మరమ్మతుల కోసం సంబంధిత అధికారులు రూ.2,50,000 మంజూరు చేశారని, అయితే మైన్స్, జియాలజీ డిపార్ట్‌మెంట్ అధికారులు నిధులను నిలిపి వేశారని ఆవేదన వ్యక్తం చేశారు. మరుగుదొడ్లు సరిగా లేక విద్యార్థుల పడుతున్న అవస్థలను కలెక్టర్‌కు వివరించారు. తక్షణం స్పందించిన ఆయన అధికారులతో మాట్లాడి నిధులు విడుదల చేయిస్తామని హామీ ఇచ్చారని జన విజ్ఞాన వేదిక, విద్యా వికాస వేదిక ప్రతినిధులు కుప్పస్వామి, వెంకటరమణ తెలిపారు.

## అభివృద్ధిపై ఎంపీడీవోతో టీడీపీ నేతల చర్చలు



రేణిగుంట, జూలై 29 ప్రభాతవార్త: రేణిగుంట మండలంలో త్వరితగతిన అభివృద్ధి పనులను పూర్తి చేయాలని మండల, పట్టణ టీడీపీ నేతలు ఎంపీడీవో విష్ణు చిరంజీవికి సోమవారం విజ్ఞప్తి చేశారు. మండలంలో కుంటుపడిన పారిశుధ్య పనులు, సీసీ రోడ్ల మరమ్మతులు, వీధిలైట్లు, తాగునీరు మోటార్ల మరమ్మతులు, నీటి ఎద్దడి నివారించడానికి నూతన బోర్ల డ్రిల్లింగ్‌పై దృష్టి సారించాలని కోరారు. ఎక్కువ మందికి ఉపాధి హామీ పనులు కల్పించాలని కోరారు. ఉపాధిహామీ పనులకు వచ్చే కార్మికుల సంఖ్యను పెంచి వారికి జీవనోపాధి కల్పించాలన్నారు. నిధుల మంజూరు విషయం ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. ఎంపీడీవో విష్ణు చిరంజీవి సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో ఈవోపీఆర్‌డీ వెంకటరత్నమ్మ, ఉపాధిహామీ ఏపీవో జ్యోతి, టీడీపీ మండల అధ్యక్షుడు మునిచంద్రారెడ్డి, పట్టణ టీడీపీ అధ్యక్షుడు మహబూబ్ బాషా, అన్నాసంపల్లి నాధమునిరెడ్డి, టీడీపీ నేతలు పాల్గొన్నారు.

## రాష్ట్రంలో ఆటవిక, అరాచక పాలన



సత్యవేడు, జూలై29 ప్రభాతవార్త: రాష్ట్రంలో జరుగుతున్న హత్యలు, దాడులు, దౌర్జన్యాలు, విధ్వంశాలు చూస్తే మొత్తంగా ఒక ఆటవిక అరాచక పాలనసాగుతుందని వైసిపి సత్యవేడు సమన్వయకర్త నూకతోటి రాజేష్ అన్నారు. సోమవారం ఆయన విడుదల చేసిన పత్రిక ప్రకటనలో మాట్లాడుతూ సిఎం చంద్రబాబు, ఆయన తనయుడు లోకేష్‌లు రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని అమలుచేస్తూ కేవలం 50రోజుల పాలనలో ఆంధ్రప్రదేశ్ అంటే అరాచకం, ఆటవిక పాలన అనే బ్రాండ్ ఇమేజ్‌ను సృష్టించారని విమర్శించారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను అమలుచేయలేక చంద్రబాబు కాలయాపన చేస్తున్నారని ఎద్దేవా చేశారు. నిరుద్యోగభృతి రూ॥3000 ఇస్తామన్న చంద్రబాబు దాని ఊసే ఎత్తడం లేదన్నారు. చివరకు వాలంటీర్లకు రూ॥10000 ఇస్తామని చెప్పి వారిని రోడ్డున పడేయడమేనా అభివృద్ధి అంటూ ప్రశ్నించారు. సత్యవేడు నియోజకవర్గం లోని కొన్ని గ్రామాల్లో వైసిపి జెండా దిమ్మెలను ధ్వంసం చేయడం, మరికొన్నిచోట్ల అల్లర్లు సృష్టించడం, బెదిరింపులకు పాల్పడటం చేస్తున్నారని తెలిపారు. ఇవన్నీ తాత్కాలికమే అని ఎవరూ భయపడాల్సిన అవసరం లేదని, పార్టీ శ్రేణులకు అండగా ఉంటానని రాజేష్ భరోషా ఇచ్చారు.

## చందన అలంకరణలో శ్రీ కాలభైరవస్వామి



నగరి, జూలై 29 ప్రభాతవార్త: నగరి పట్టణం ఈశ్వర ఆలయంలో వెలసి ఉన్న శ్రీ కాలభైరవ స్వామివారికి ప్రత్యేక అష్టమి పూజలు వైభవంగా జరిగాయి. స్వామివారికి వివిధ రకాలైన అభిషేక వస్తువులు పాలు, పెరుగు, చందనం, పంచామృతం, పన్నీరు, విభూది, వాటితో ప్రత్యేక అభిషేక కార్యక్రమాలు జరిగాయి. అభిషేక అనంతరం స్వామివారికి చందనంతో ప్రత్యేక అలంకరణ జరిగాయి. భక్తులు మొక్కుబడిగా ఇచ్చినటువంటి వడమాలలతో ప్రత్యేక అలంకరణ గావించారు. ఉభయ దారులు దంపతులు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. పూజల అనంతరం విచ్చేసిన భక్తులకు విభూది ప్రసాదాలు వివిధ రకాలైన ప్రసాదాలు పంపిణీ చేశారు.

## కుమారస్వామి సేవలో...అంచనాలకు మించి భక్తులు



శ్రీకాళహస్తి, జూలై 26 ప్రభాతవార్త : శ్రీకాళహస్తీశ్వ రాలయానికి అనుబంధంగా నిర్వహిస్తున్న విజ్ఞాన గిరిపై వెలసిన కుమారస్వామి ఆలయంలో జరుగుతున్న ఆడికృత్తిక మహోత్సవాల సందర్భంగా సోమవారం ఆడికృత్తిక సందర్భంగా శ్రీకాళహస్తీశ్వ రాలయ ధర్మకర్తల మండలి మాజీ చైర్మెన్, బిజెపి రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్ కుమార్ ఉదయం దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ మర్యాదలతో ఇఒ ఎన్వియస్ఎన్ మూర్తి, ఆలయ సిబ్బంది స్వాగతం పలికారు. సామాన్యభక్తుల వలె వారు దర్శనం చేసుకున్నారు. వారికి హారతులిచ్చారు. ఆడికృత్తిక సందర్భంగా ఆలయాధికారులు, సిబ్బంది పోలీసులు, మున్సిపల్, విద్యుత్ సిబ్బంది సమన్వయంతో పని చేయటంతో ఎలాంటి ఇబ్బంది లేకుండా భక్తులు సుదర్శనం చేసుకున్నారు. రాత్రి 8గంటల వరకు కూడా క్యూలైన్ నిండుగా ఉంది. కోనేరులో తలనీలాలు సమర్పించుకునేవారు, దర్శనానికి నిరీక్షిస్తున్నారు. అధికారుల అంచనాలకు మించి భక్తులు హాజరైన చక్కటి ఏర్పాట్లు నిర్వహించి ప్రశంసలందుకున్నారు.

## రోడ్డు సమస్యలు పరిష్కరించండి

### - జిల్లా కలెక్టర్‌కు ఎమ్మెల్యే వినతి

పిచ్చాటూరు, జూలై 29 ప్రభాతవార్త: సత్యవేడు నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న పలు ఆర్అండ్‌బీ రోడ్డు పనులు సత్వరం చేపట్టి పూర్తి చేయాలని సత్యవేడు ఎమ్మెల్యే ఆదిమూలం జిల్లా కలెక్టర్ వెంకటేశ్వరులను కోరారు. సోమవారం మధ్యాహ్నం తిరుపతిలోని జిల్లా కలెక్టర్ కార్యాలయానికి ఎమ్మెల్యే చేరుకుని ఈ మేరకు వినతి పత్రాన్ని కలెక్టర్‌కు సమర్పించారు. సత్యవేడు నియోజకవర్గంలోని సమస్యల పరిష్కారం కోసం త్వరలో ఏదో ఒక మండలంలో నియోజకవర్గ స్థాయి అధికారులు సమీక్ష సమావేశం నిర్వహించాలని కలెక్టర్‌ను ఎమ్మెల్యే ఆహ్వానించారు. ఇందుకు కలెక్టర్ సానుకూలంగా స్పందిస్తూ ప్రజా సమస్యల పరిష్కారానికి తాము ఎల్లవేళలా సిద్ధంగా ఉన్నామని కలెక్టర్ తెలిపినట్లు ఎమ్మెల్యే వెల్లడించారు.

# ప్రజా సమస్యలను నిబద్ధతతో పరిష్కరించాలి

**- కడ ప్రాజెక్ట్ డైరెక్టర్ వికాస్ మర్మత్ - పేదరికం లేని కుప్పంకు సమగ్ర ప్రణాళిక తయారీ !!**



కుప్పం, జూలై 29 ప్రభాతవార్త : అధికార యంత్రాంగం ప్రజా సమస్యలను నిబద్ధతతో పరిష్కరించాల్సిన అవసరం ఉందని కడ ప్రాజెక్ట్ డైరెక్టర్ వికాస్ మర్మత్ పేర్కొన్నారు. సోమవారం స్థానిక మండల కార్యాలయంలో ప్రజా సమస్యల పరిషా ్కర వేదిక కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా 42మంది ప్రజలు వివిధ సమస్యలపై పి.డి.కి వినతిపత్రాలు సమర్పించారు. అనంతరం జరిగిన అధికారుల సమావేశంలో పిడి మాట్లాడారు. కుప్పం నియోజకవర్గంలో పేదరికం లేకుండా చూడాలన్న సిఎం చంద్రబాబునాయుడు ఆదేశాలతో ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపరచేందుకు అవసరమైన ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు తెలిపారు. అలాగే ప్రజలకు మౌలిక వసతుల కల్పనకు మొదటి ప్రాధాన్యత ఇస్తున్నట్లు పేర్కొన్నారు. విద్య, ఆరోగ్య ం, ఉపాధి అవకాశాలు, వనరుల అభివృద్ధి తదితరాలపై ప్రణాళికలు రచిస్తున్నట్లు చెప్పారు. ఇప్పటికే గ్రామీణనీటిపారుదల, విద్యాశాఖకు సంబంధించి ప్రతిపాదనలు అందాయన్నారు. ఐసిడిఎస్ ఇతర శాఖలనుంచి అందాల్సి ఉందన్నారు. పిహెచ్‌సిల అభివృద్ధికి తగు ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. 17ప్రభుత్వ శాఖల పరిధిలో చేపట్టాల్సిన అభివృద్ధి కార్యక్రమాలపై సమగ్ర ప్రణాళికలు ప్రభుత్వానికి అందించడం జరుగుతుందన్నారు. కుప్పంలో ప్రజలనుంచి అందే ఫిర్యాదులను నేరుగా ముఖ్యమంత్రి కార్యాలయంలో ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించడ ం జరుగుతుందన్నారు. సిఎంఒ అధికారులు కూడా ముఖ్యమంత్రి ఆదేశాలతో కుప్పంలో సమస్యలపై దృష్టి సారిస్తున్నారని ఈ నేపథ్యంలో స్థానిక అధికారులు ప్రజా సమస్యలపై నిర్లక్ష్యం వహించరాదని పిడి ఆదేశించారు. కార్యక్రమంలో పలువురు అధికారులు పాల్గొన్నారు.

# కొత్త విద్యార్థులకు ఐఐటిలో పరిచయ కార్యక్రమం




శ్రీకాళహస్తి జూలై 29 ప్రభాతవార్త : ఏర్పేడులోని తిరుపతి ఐఐటిలో సోమవారం కొత్త విద్యార్థులకు పరిచయ కార్యక్రమాలను ఏర్పాటు చేసారు. సమగ్ర ఓరియంటేషన్ కార్యక్రమాలను ఏర్పాటు చేసారు. ఈ ఏడాది 2024 ఆగస్టు బ్యాచ్‌కు సంబంధించిన కొత్త బిటెక్, ఎం.టెక్, మాస్టర్ఇన్ పాలసీ, ఎంఎస్ బై రీసెర్చ్ పిహెచ్‌డిలో చేరిన విద్యార్థుల కోసం సమగ్ర ఓరియంటేషన్ కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించారు. కొత్తగా చేరిన విద్యార్థులు వారి తల్లితండ్రులు హాజరయ్యారు. ఈ కార్యక్రమాలకు డైరెక్టర్ కె.యన్, సత్యనారాయణ ఐఐటికి సంబంధించిన దిశ,దెశ నిర్దేశం చేసారు. కొత్తగా ఏర్పాటు అయిన ఐఐటికి సంబంధించి అందుబాటులో ఉన్న వాతావరణం, క్యాంపస్‌జీవితం మరియు వనరులతో విద్యార్థులకు పరిచయం చేయటం లక్ష్యంగా పెట్టుకుందన్నారు. అకడమిక్ కార్యక్రమాలు,పరిశోధనా అంశాలు క్యాంపస్ సౌకర్యాలు,క్యాంపస్‌లో ఉన్న సదుపాయాలు,భద్రత,సామాజిక కార్యక్రమాలు విద్యార్థులకు విద్యతో పాటు సామాజిక బాధ్యత జీవితంలో ఉపయోగపడే అంశాలను ప్రధానాంశాలుగా తీర్చి దద్దుతున్నామని విద్యార్థుల తల్లిదండ్రులకు డైరెక్టర్ సత్యనారాయణ వివరించారు.క్యాంపస్‌లో టూర్ ఏర్పాటు చేసి ప్రతి శాఖకు సంబంధించిన వివరాలనుఇక్కడ ఏర్పాట్లును డైరెక్టర్ స్వయంగా తల్లిదండ్రులకు వివరించారు. తిరుపతి ఐఐటి విద్యార్థుల కోసం కొత్త విద్యాప్రమాణాలకు నాంది పలికిందని డైరెక్టర్ సత్యనారాయణ వివరించారు. తల్లిదండ్రులు బిడ్డలకు అందించే వరాలు 'విద్య' అని అందులోనూ ఐఐటిలో విద్యను అందించటం అనేది ఎన్నో జన్మల పుణ్యఫలమని భావించాలన్నారు. ఆస్తులైతే పొగొట్టుకోవచ్చు.ధనం ఇస్తే దొంగలుదోచుకొని పోవచ్చు.కానీ విద్యను అందిస్తే జీవితాంతం సుఖంగా ఉంటారన్నారు.తిరుపతి ఐఐటిలో విద్యనందించటం ఓ మధునానుభూతి అని డైరెక్టర్ సత్యనారాయణ వివరించారు.ఈ కార్యక్రమాల్లో అన్ని శాఖల హెడ్‌లు, సిబ్బంది పాల్గొన్నారు.

## శ్రీవళ్ళీదేవసేవ సుబ్రమణ్యస్వామికి ... ఆకట్టుకున్న అలంకరణ



శ్రీకాళహస్తి, జూలై 29 ప్రభాతవార్త : ఆడికృత్తిక మహోత్సవాల్లో భాగంగా సోమవారం శ్రీవళ్ళీ దేవసేన సమేత సుబ్రమణ్యస్వామివార్లకు ఆలయ ంలోని అలంకార మండపంలో అలంకరణ గురుకుల్ రాజేష్‌గురుకుల్, సూరిగురుకుల్‌లు సర్వాంగ సుందరంగా అలంకరించారు. స్వామి వారి ఒక చేతిలో శూలం, మరో చేతిలో మయూర వాహనం గుర్తు ఉన్న దండాయుదం ధరించి ఉండడం విశేషం. అందుకే సుబ్రమణ్యస్వామి దుష్టసంహారం చేసేందుకు దండాయుధంతో పాటు వివిధ రకాలపై ఆభరణాలతో స్వామిఅమ్మవార్లను భక్తులకు ఇట్టే ఆకట్టుకుంది. స్వామిఅమ్మవార్లను దర్శించుకునేందుకు పలువురు భక్తులు హాజరయ్యారు.

## ఆలసత్వం లేకుండా సమస్యలు పరిష్కారం : ఎస్పీ



చిత్తూరు టౌన్, జూలై 29 ప్రభాతవార్త: పోలీసు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో ప్రజల నుండి అందిన సమస్యలను ఆలస్యం లేకుండా పరిష్కరించాలని ఎస్పీ మణికంఠ చందోలు పోలీసు అధికారులను ఆదేశించారు. చిత్తూరు పాత పోలీసు కార్యాలయంలో సోమవారం ఎస్పీ మణికంఠ చందోలు ఆధ్వర్యంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ఎస్పీ మణికంఠ చందోలుతో పాటు అడ్మిన్ ఎఎస్పీ ఆరీఫుల్లా, దిశ డిఎస్పీ సుధాకర్‌రెడ్డిలు హాజరై ప్రజల నుండి ఫిర్యాదులు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ప్రజల నుండి 31 ఫిర్యాదులు అందగా అందులో భూతగాదాలకు సంబంధించి 8, ఆస్తి తగాదాలు 7, ఇంటి తగాదాలు 4, నగదు తగాదాలు 4, కుటుంబ తగాదాలు 4, చీటింగ్ 2, వేధింపులు 2 వున్నాయి.

## రాష్ట్రంలో శాంతిభద్రతలు పునరుద్దరించండి

**-లోక్‌సభలో తిరుపతి ఎంపి డాక్టర్ గురుమూర్తి**



తిరుపతిటౌన్, జూలై 29ప్రభాతవార్త: రాష్ట్రంలో శాంతిభద్రతలను తక్షణమే పునరుద్ధరించాలని కేంద్రహోంమంత్రిత్వశాఖ జోక్యం చేసుకోవాలని తిరుపతి ఎంపి డాక్టర్ మద్దిల గురుమూర్తి డిమాండ్ చేశారు. లోక్‌సభలో సోమవారం ప్రత్యేక అధికరణ 377 క్రింద తిరుపతి ఎంపి ఈ విషయాన్ని లేవదీశారు. తమ పార్టీ అదినేత,మాజీ సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి భద్రత అత్యంత ఆందోళనకరంగా ఉందన్నారు. జడ్‌సెక్యూరిటీ భద్రతకు అర్హులైనప్పటికీ రాష్ట్రప్రభుత్వం తగిన రక్షణ కల్పించడంలో విఫలమైందని సభ దృష్టికి తీసుకెళ్ళారు. మాజీ సిఎం జగన్‌కు భద్రత కల్పించాలని, 2019,2024లో తమ నాయకుడిపై జరిగిన దాడుల విషయాన్ని ఎంపి ప్రస్తావించారు.

## భక్తులకు సౌకర్యవంతంగా అన్నమయ్యభవనం సిద్ధం

**-టిటిడి అదనపు ఈఓ వెంకయ్యచౌదరి**



తిరుమల,జూలై 29ప్రభాతవార్తప్రతినిధి: వేంకటేశ్వరస్వామి దర్శనార్థం తిరుమల కు వస్తున్న శ్రీవారి (ట్రస్ట్ భక్తులకు) మరింత సులభంగా సేవలందించే దిశగా కార్యాచరణ సిద్ధంచేస్తున్నట్లు టిటిడి అదనపు ఈఓ చిరుమామిళ్ల వెంకయ్య చౌదరి తెలిపారు. అలాగే ఇప్పటికే మరమ్మతులు, ఆధునీకరణ పనులు పూర్తిచేసుకున్న అన్నమయ్యభవనంలోని సమావేశం మందిరాన్ని, గదులను అదనపు ఈఓ వెంకయ్యచౌదరి పరిశీలించారు.

## తిరుత్తణి మురుగన్‌కు టిటిడి సారే



తిరుమల,జూలై 29ప్రభాతవార్తప్రతినిధి: తిరుపతికి 60కిలోమీటర్లు దూరంలో ఉన్న తిరుత్తణి వల్లీదేవసేన సమేత సుబ్రమణ్యస్వామికి ఆడికృత్తిక పర్వదినం పురస్కరించుకుని టిటిడి సారే అందించింది. సోమవారం ఆడికృత్తిక పర్వదినాన టిటిడి ఈఓ జె.శ్యామలరావు దంపతులు పట్టువస్త్రాలను అందజేయడంతో స్వామివారికి అలంకరించారు.

## ఫిర్యాదులపై సత్వరమే సమగ్ర విచారణ

**-తిరుపతి జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు**

తిరుపతిటౌన్, జులై 29ప్రభాతవార్త: ప్రజల నుండి అందిన ఫిర్యాదులను క్షుణ్ణంగాపరిశీలించి, సత్వరమే సమగ్ర విచారణ జరిపి బాధితులకు న్యాయం చేయాలని తిరుపతి జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడు అధికారులకు ఆదేశాలిచ్చారు. సమస్యలపై చర్యలు తీసుకుంటామని అన్నారు. సోమవారం తిరుపతిలోని జిల్లా పోలీసు కార్యాలయంలో "మీ కోసం ప్రజాసమస్యల పరిష్కారవేదిక"నిర్వహించారు. జిల్లానలుమూలల నుండి 55మంది బాధితులు ఎస్పీ కార్యాలయానికి చేరుకుని తమతమ సమస్యలపై అర్జీలు సమర్పించారు. ప్రజలతో స్వయంగా ఎస్పీ సుబ్బరాయుడు మాట్లాడి,వారికి ఓదార్పు కలిగిస్తూ సమస్యలు తెలుసుకున్నారు. మీ సమస్యలపై త్వరగానే పరిష్కారం చేస్తామని హామీ ఇచ్చారు. జిల్లాలోని పోలీసుస్టేషన్‌లు, సర్కిల్ కార్యాలయాలు, సబ్‌డివిజన్ కార్యాలయాల్లో సమస్యల పరిష్కారవేదిక ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీలు వెంకట్రావు, విమలకుమారి పాల్గొన్నారు.

## విశ్రాంత జీవితం ప్రశాంతతకు ఫెన్షన్ అవసరం-టి.గోపాల్

తిరుపతిటౌన్, జులై 29ప్రభాతవార్త: విశ్రాంతి పొందిన ఉద్యోగులు ప్రశాంత జీవితం గడపడానికి ఫెన్షన్ అవసరమని, ఉద్యోగులు పదవీవిరమణ చేసేరోజుకు 50శాతం ఫెన్షన్‌గానిర్ణయించి ఫలితాంగా కోట్లాదిమంది రిటైర్డ్ ఉద్యోగులు విశ్రాంతంలో ప్రశాంతతకు అవసరమని రిటైర్డ్ ఉద్యోగులసంఘం జిల్లా అధ్యక్షుడు టి.గోపాల్ అన్నారు. ఫెన్షనర్ల ఆశాజ్యోతి డిఎస్ నకార కృషి ఫలితంగా ఫెన్షనర్లకు మంచి జరిగిందన్నారు. తిరుపతిలో రిటైర్డ్ ఉద్యోగుల సంఘం నాయకులు గోపాల్, చిట్టిబాబు, మునికృష్ణ, సుబ్రమణ్యం, వెంకటరమణ, తులసీరామ్, జగన్నాథంనాయుడు, వెంకట నారాయణ, శ్రీనివాస్‌రెడ్డి, విజయభాస్కర్‌రెడ్డి, ఆనంద్,తులసీరామ్ తదితరులు నకార చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు.

## ప్రతి ఒక్క ప్రజా సమస్యలను పరిష్కరిస్తాం : కమిషనర్

తిరుపతి కార్పొరేషన్, జులై 29 ప్రభాతవార్త : తిరుపతి నగరంలో నెలకొన్న సమస్యలపై ప్రజల నుండి వస్తున్న ప్రతి ఒక్క సమస్యను పరిశీలించి పరిష్కరిస్తామని ఫిర్యాధులు, అర్జీలు ఇచ్చేందుకు వచ్చిన ప్రజలనుద్దేశించి తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ నారపురెడ్డి మౌర్య అన్నారు. తిరుపతి నగర పాలక సంస్థ కార్యాలయంలో సోమవారం మీ కోసం ప్రజా సమస్యల పరిష్కార వేధిక కార్యక్రమంలో కమిషనర్ నారపురెడ్డి మౌర్య ప్రజల నుండి ఫిర్యాదులను, వినతులను స్వీకరించారు. కమిషనర్‌ని కలిసిన డిప్యూటీ మేయర్ ముద్రనారాయణ మాట్లాడుతూ నగరంలో చాలా ప్రదేశాల్లో అనుమతులు లేని ప్లెక్సీలు రోజులు తరబడి వున్నాయని, కమిషనర్ స్పందిస్తూ పరిశీలించి పరిష్కరిస్తామన్నారు. అదే విధంగా స్టాండింగ్ కౌన్సిల్ సభ్యులు ఎస్‌కె బాబు, నరసింహాచారి, కార్పొరేటర్లు కోటూరి ఆంజినేయులు, దొడ్డారెడ్డి ప్రవళ్ళికా రెడ్డి, నరేంద్రనాథ్, బోకం అనిల్, అన్నా అనీత యాదవ్, ఆర్‌సి మునికృష్ణ, దూది శివకుమార్ తదితరులు వున్నారు.

## సుబ్రమణ్య స్వామికి పట్టు వస్త్రాలు సమర్పణ



పాకాల, జులై 29 ప్రభాతవార్త : పాకాల మండలం, ఊట్లవారిపల్లి సమీపంలో ఆనందగిరి కొండపై వెలసిన శ్రీ వల్లి దేవసేన సమేత సుబ్రమణ్య స్వామి 76వ ఆడికృత్తిక బ్రహ్మోత్సవాలలో భాగంగా భరణి నక్షత్రం సమయంన సతీసమేతంగా చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని, పూతలపట్టు ఎమ్మెల్యే కలికిరి మురళి దంపతులు విచ్చేసి కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామి దేవస్థానం తరపున పట్టు వస్త్రాలు సమర్పించారు. ఆలయ అధికారులు ఈవో ఎస్. యువరాణి, ఆలయ ఛైర్మన్ సోంపల్లి చంద్రశేఖర్ నాయుడు స్వాగతం పలికారు. అనంతరం షణ్ముఖ సుబ్రమణ్యస్వామికి యాగ పూజ, భరణి అభిషేకం, షణ్ముఖ సహస్రనామార్చన, మహా మంగళహారతి గావించారు. ఈ కార్యక్రమంలో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## గణనాథునికి 10 కిలోల వెండి పూజా సామాగ్రి విరాళం



కాణిపాకం, జూలై 28 ప్రభాతవార్త: కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామివారికి ఓ భక్తుడు సోమవారం సుమారు 10 కిలోల పూజా సామాగ్రిని సోమవారం విరాళంగా అందజేశారు. విశాఖపట్నంకు చెందిన కృష్ణపట్నం పోర్ట్ సీఈఓ జి.జగన్నాధరావు, పుష్ప దంపతులు సుమారు 10 లక్షల రూపాయల వ్యయంతో 10 కిలోల వెండితో ప్రత్యేకంగా తయారు చేయించిన పూజా సామాగ్రిని ఆలయానికి విరాళంగా అందజేశారు. ఈమేరకు రెండు పెద్ద దీపస్థంభాలు, ఐదు చెంబులు, ఒక తట్ట, రెండు ప్రసాదం పాత్రలను విరాళంగా అందజేశారు. దాతలు వీటిని ప్రముఖ వ్యాపారవేత్త దిగువమాఘం కుంటముక్కల కుమార్‌నాయుడుతో కలసి ఆలయ ఏఈఓ విద్యాసాగర్‌రెడ్డి, ఆలయ సూపరెండెంట్ కోదండపాణిలకు అందజేశారు. దాతలకు ఆలయం సంప్రదాయం ప్రకారం స్వామివారి దర్శనం కల్పించి తీర్థ, ప్రసాదాలను అందజేశారు. ఈకార్యక్రమంలో టెంపుల్ ఇన్స్‌పెక్టర్ విఘ్నేష్ తదితరులు పాల్గొన్నారు.

## భక్త జనప్రియ హరోం...హరా...!



చౌడేపల్లి, జూలై 29 ప్రభాతవార్త : సుబ్రమణ్యస్వామి ప్రీతి పాత్రమైన కావిళ్ళను భుజాన పెట్టుకొని హరోం...హరా అంటూ భక్తులు ఊరేగారు. ఆడికృత్తిక సందర్భంగా మండల వ్యాప్తం గా కావిళ్ళ పండుగను సాంప్రదాయ బద్ధంగా నిర్వహించారు. స్థానిక మృత్యుంజయేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలోని శ్రీ వల్లీ దేవసేన సమేత షణుఖ సుబ్రమణ్యస్వామి, కొత్తవీరపల్లి బాల సుబ్రమణ్యస్వామి తదితర ఆలయాలు హరోం...హర నినాదాలతో మార్మోగాయి. కొందరు భక్తి పారవశ్యంతో చిందులేస్తుంటే భగవంతుడే పూని నాట్యమాడుతున్నట్లుగా అందరూ వారిని తాకి భక్తితో పులకరించారు. కొత్తవీరపల్లి బాలసుబ్రమణ్యస్వామి ఆలయంలో విశేష సంఖ్యలలో తరలివచ్చిన భక్తులను మేళతాళాలతో స్వాగతం పలికి ఉచిత అన్న ప్రసాదాలందించారు. చౌడేపల్లి పట్టణంలో బెల్లాల కుటుంబీకుల ఆధ్వర్యంలో స్వామివారు నెమలి వాహనంపై ఊరేగి ఇంటింటా పూజలందుకొన్నాడు.

## పురాతన నాణేలను భావితరాలకవగాహనే లక్ష్యం : సాయికృష్ణ

చౌడేపల్లి, జూలై 29 ప్రభాతవార్త : పురాతన, తాజా నాణేలు, నోట్లపై భావితరాలకు అవగాహన కల్పించాలనే లక్ష్యంతో ముందుకు వెళుతున్నానని నాణేల సేకరణాకర్త సాయికృష్ణ అన్నారు. మండలంలోని పుదిపట్ల ఉన్నతపాఠశాలలో పాత, కొత్త నాణేలు, కరెన్సీ ప్రదర్శన నిర్వహించారు. పుంగనూరుకు చెందిన సాయికృష్ణ తన 10యేట నుంచి 12యేళ్లపాటు తల్లి మంజుల ప్రేరణతో నాణేలను సేకరిస్తున్నాని తెలిపాడు. రాజరికం కాలం నుంచి దేశ, విదేశాల్లో చలామనీలో వున్న పాత, కొత్త నాణేలను సేకరిస్తున్నట్లు వివరించాడు. ఇప్పటి వరకు 26రకాల రాజుల కాలం నాటి నాణేలు, 96రకాల బ్రిటీష్ పాలన, ప్రపంచ దేశాలకు చెందిన నాణేలు, నోట్లను సేకరించాననీ, విద్యాలయాల్లో ప్రదర్శించడం వల్ల పాత, కొత్త నాణేలు, నోట్లపట్ల విద్యార్థులకు అవగాహన వుంటుందన్నారు. చిన్నతనం నుంచి దేశ, విదేశాల కరెన్సీని సేకరిస్తున్న సాయికృష్ణను ప్రధానోపాధ్యాయురాలు పద్మజ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు సత్కరించారు.

## హెడ్‌కానిస్టేబుల్ కుటుంబానికి రూ. లక్ష ఆర్థిక సాయం



చిత్తూరు, జులై 29 ప్రభాతవార్త: పాలసముద్రం పోలీస్ స్టేషన్‌లో హెడ్‌కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తూ మృతి చెందిన కె.జయప్రకాష్ భార్య ఎస్.రెడ్డిరాధకు ఎస్పీ మణికంఠ చందోలు సోమవారం ఐఆర్‌డిఎఫ్ ఫండ్ నుండి ఒక లక్ష రూపాయల ఆర్థిక సహాయం అందజేశారు. చిత్తూరు ఆర్మ్‌డ్ రిజర్వ్ కార్యాలయంలో ఎస్పీ మణికంఠ చందోలు అడ్మిన్ ఎఎస్పీ ఆరీఫుల్లా, పోలీసు అసోసియేషన్ అధ్యక్షుడు ఉదయ్‌కుమార్ సమక్షంలో మృతి చెందిన హెడ్‌కానిస్టేబుల్ భార్య ఎస్.రెడ్డి రాధాకు ఈ మొత్తంను అందించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ మృతి చెందిన హెడ్‌కానిస్టేబుల్ జయప్రకాష్ కుటుంబానికి పోలీసు శాఖ తరపున అన్ని రకాల సహాయ సహకారాలు అందిస్తామని పేర్కొన్నారు.

## కూసూరులో ఘనంగా శ్రీ సుబ్రమణ్యస్వామి ఉత్సవాలు



కుప్పంరూరల్, జూలై 29 ప్రభాతవార్త : మండలంలోని కూసూరు అటవీ ప్రాంతం సోమవారం హరోంహర..వేల్ మురుగ నినాదాలతో మార్మోగింది. అటవీ ప్రాంతంలో వెలసిన శ్రీబాలసుబ్రమణ్యసా ్వమి ఆడికృతిక బ్రహ్మోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఉదయం స్వామివారికి ప్రత్యేక అభిషేకం జరిపారు. ఈసందర్భంగా మొక్కులు కలిగిన భక్తులు వీపుకు తేరు లాగడం, కొక్కీలు వేసుకోవడం వంటి విన్యాసాలు చేస్తూ ఆలయం వద్దకు చేరుకుని కావడులను పెద్ద ఎత్తున చెల్లించారు. ఆహ్లాదకర అటవీ ప్రాంతంలో ఉన్నఈ ఆలయానికి ఉదయం నుంచే భక్తులు పోటెత్తారు. భక్తులకు ఆలయ ప్రాంగణంలో నిర్వాహకులు అన్నదానం జరిపారు. భక్తుల సౌకర్యార్థం ఆర్టీసీ వారు ప్రత్యేక బస్సులను నడిపారు. కుప్పం అమ్మ హాస్పిటల్ వారిచే ఉచిత వైద్య శిబిరం ఏర్పాటుచేశారు. అర్బన్ సిఐ జిటి నాయుడు నేతృత్వంలో పోలీసులు బందోబస్తు చేపట్టారు.

## కెసి ఆస్పత్రిలో అరుదైన శస్త్ర చికిత్స

**మహిళ కడుపు నుంచి 5.50 కిలోల కణతి తొలగింపు**



కుప్పం, జూలై 29 ప్రభాతవార్త : కుప్పంలోని కెసి మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రిలో వైద్యులు అరుదైన శస్త్ర చికిత్స నిర్వహించినట్లు ఆస్పత్రి ఛైర్మన్ డా॥ మంజునాథ్ తెలిపారు. గుడుపల్లె మండలంకు చెందిన ఓ మహిళ కడుపునొప్పితో బాధపడుతూ చికిత్స కోసం ఆస్పత్రికి రాగా ఆమెకు స్కానింగ్ చేయగా కడుపులో కణతి ఉన్నట్లు గైనకాలజిస్ట్ డా॥ శిల్ప గుర్తించారన్నారు. అనంతరం ఆ మహిళకు శస్త్ర చికిత్స చేసి విజయవంతంగా కడుపులో ఉన్న 5.50 కిలోల కణతిని తొలగించినట్లు చెప్పారు. ప్రస్తుతం మహిళ ఆరోగ్యంగా ఉందని తెలిపారు. ఈసందర్భంగా శస్త్ర చికిత్స నిర్వహించిన వైద్య బృందం డా॥ బాలాజీ, డా॥ స్రవంతి, రేడియాలజిస్ట్ డా॥ చైతన్యకృష్ణలను అభినందించారు.

## అరగొండలో ఘనంగా భరణి వేడుకలు



తవణంపల్లె, జూలై 28 ప్రభాతవార్త: మండలంలోని అరగొండలో వెలసిన శ్రీస్వయంభువనేశ్వర కుమారస్వామి దేవస్థానంలో జరుగుతున్న ఆడికృత్తిక ఉత్సవాల్లో భాగంగా సోమవారం భరణి వేడుకలు అత్యంత ఘనంగా నిర్వహించారు. ఆలయంలో ప్రతి ఏటా ఆలయంలో రెండు రోజుల పాటు ఆడికృత్తిక ఉత్సవాలను అత్యంత ఘనంగా నిర్వహిస్తుంటారు. ఈమేరకు ఆలయ ధర్మకర్త పద్మవిభూషణ్ డాక్టర్ ప్రతాప్.సి.రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం భరణి వేడుకలను నిర్వహించారు. ఈసందర్భంగా అరగొండలోని శ్రీకోదండరామస్వామి దేవస్థానంలో ఉదయం పైమాగంకు చెందిన కెవి. ప్రకాష్‌రెడ్డి సోదరులచే సుబ్రమణ్య స్వామివారికి అభిషేక ఆరాధనలు నిర్వహి ంచారు. అనంతరం శ్రీవళ్ళి దేవయాన సుబ్రమణ్య స్వామివారికి, శ్రీకామాక్షాంబ శ్రీస్వయంభువనేశ్వర స్వామివార్లకు, శ్రీసీతా కోదండరామ స్వాముల వారికి, శ్రీరుక్మిణి సత్యభామ వేణుగోపాలస్వామివార్లకు కళ్యాణోత్సవంను అత్యంత ఘనంగా శాస్త్రోక్తంగా నిర్వహించారు. కార్యక్రమంలో దేవస్థానం అర్చకులు ప్రసాద్‌స్వామి, నిర్మల దంపతులు, విభాకరశాస్త్రి, ఆలయ నిర్వహకులు అపోలో మెడికల్ కాలేజ్ ఇన్‌చార్జి నరేష్‌కుమార్‌రెడ్డి, రామకృష్ణారెడ్డి, మాజీ సర్పంచ్ రాజేశ్వరమ్మ, ధనంజయ, అరగొండ పరిసర గ్రామాలకు చెందిన భక్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

## తడ ఆలయాల్లో ఆడికృతిక ఉత్సవాలు

తడ, జూలై 29 ప్రభాతవార్త: ఆంధ్రా, తమిళనాడు సరిహద్దుల్లోని తడ మండలంలోని పలు ఆలయాల్లో సోమవారం ఆడికృతిక ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. పలుచోట్ల రెండురోజుల పాటు ఈ ఉత్సవాలు జరుపుతున్నారు. సుబ్రహ్మణ్య స్వామిని కొలిచే ఈ పండగ తమిళనాడులో విస్తారంగా జరుగుతుంది. ఆ ప్రభావం తడ మీద కూడా ఉంటుంది. మండల పరిధిలోని చినమాంబట్టు ఆలయంలో అక్కడి గ్రామస్థులు ఆడికృతిక సందర్భంగా సుబ్రహ్మణ్య స్వామికి విశేష పూజలు నిర్వహించారు. వాటంబేడు, బోడిలింగాలపాడు శివాలయాల్లోను శివపుత్రుడు కార్తికేయునికి పూజలు చేశారు. ఉదయం నుంచి అభిషేకాలు నిర్వహించారు.

## శ్రీవళ్ళీ దేవసేన శ్రీసుబ్రమణ్య స్వామి వారి కళ్యాణోత్సవం



చంద్రగిరి, జూలై 29 ప్రభాతవార్త: స్థానిక శ్రీశ్యామలాంబ సమేత మల్లేశ్వర స్వామి (పుట్టాలమ్మ గుడి) వారి ఆలయంలో సోమవారం సాయంత్రం శ్రీవళ్ళీ దేవసేన సమేత శ్రీసుబ్రమణ్య స్వామి వారి కళ్యాణోత్సవం కన్నుల పండువగా జరిగింది. ఆలయ కమిటీ అధ్యక్షుడు మొక్కల వెంకటరమణ రెడ్డి పర్యవేక్షణలో ఆలయ ప్రధాన అర్చకుడు డాక్టర్ ఆర్.శివకుమార్ శర్మ (శైవాగమ పండితులు) పుట్టాలమ్మ గుడిలో ఆడి కృత్తిక మహోత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా శ్రీవళ్ళీ దేవసేన సమేత శ్రీ సుబ్రమణ్య స్వామి వారి ఉత్సవమూర్తులకు పట్టువస్త్రాలు ధరింపజేసి, వివిధ రకాల సుగంధభరిత పుష్పాలు, బంగారు ఆభరణాలతో విశేష అలంకరణలతో వధూవరులుగా తీర్చిదిద్దారు. సాయంత్రం 6 గంటలకు మేళతాళాలు, మంగళవాయిద్యాలు, వేదమంత్రోచ్చారణల నడుమ స్వామివారి కళ్యాణ మహోత్సవం కన్నుల పండువగా జరిపించారు. ఈ ఆర్జిత పరిణయ మహోత్సవంలో పాల్గొన్న భక్తులకు శేష వస్త్రాలను, తీర్థప్రసాదాలను అందజేశారు.

## సుబ్రమణ్యేశ్వర ఆలయంలో అన్నదానం



పుత్తూరు, జూలై 29 ప్రభాతవార్త : ఆడి కృత్తిక సందర్భంగా సోమవారం పట్టణంలోని సుబ్రమణ్యస్వామి ఆలయంలో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పోతు గుంట విజయ్‌బాబు ఆధ్వర్యంలో అన్న ప్రసాదం వితరణ జరిగింది. ఈ సందర్భంగా ఆలయంలో స్వామికి ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించారు. అర్చకులు ఆయనకు ప్రసాదాలు అందించారు. తర్వాత రూరల్ మండలం పరిధిలోని గొల్లపల్లిలో బాబు రాయల్ ఆధ్వర్యంలో జరిగిన అన్నదాన కార్యక్రమంలో విజయ్‌బాబు పాల్గొని అన్నదానం చేశారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర వాణిజ్య విభాగం కార్యదర్శి రవినాయుడు, ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి ధనపాల్, పరమేశ్వరమంగళం ఎంపిటిసి శ్రీజ బాలాజీనాయుడు, సూపర్‌బజార్ ఛైర్మన్ చంద్రయాదవ్, నాయకులు దాసరి విజయ్‌చౌదరి, వాదియార్ బాబురెడ్డి, ప్రవీణ్ నాయుడు, అజయ్‌చౌదరి, కుమార్‌రెడ్డి, అప్పయ్య నాయుడు, పరంధామ్ తదితరులు పాల్గొన్నారు.

## సుబ్రహ్మణ్యస్వామికి హరోం...హర

**కావళ్ళతో క్యూ కట్టిన భక్తులు-కిక్కిరిసిన సుబ్రహ్మణ్యస్వామి ఆలయాలు**



నగరి, జూలై 29 ప్రభాతవార్త: నగరి పట్టణంలో సోమవారం ఆడికృత్తిక వేడుకలు ఘనంగా జరిగాయి. హరోంహర నామస్మరణతో పట్టణం మారుమోగింది. సుబ్రహ్మణ్యస్వామి ఆలయాలు భక్తులతో కిక్కిరిసింది. బస్టాండ్ ప్రాంగణంలో పూజా సామగ్రి, పండ్లు, అరటి ఆకులు, కావళ్ళ విక్రయాలు జరిగాయి. మున్సిపల్ పరిధి ఏకాంబరకుప్పం సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో భక్తులు కావళ్ళతో క్యూ కట్టారు. కొత్తపేట అగర వినాయక శ్రీ వల్లిదేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో ఉదయం అభిషేకం నిర్వహించారు. తదుపరిసుబ్రహ్మణ్యస్వామిని పట్టణ వీధుల్లో ఊరేగించారు. ఆడిమాసం ప్రారంభం నుంచి ఆడికృత్తిక వరకు ఉపవాస దీక్షలతో ఉంటూ ప్రత్యేకంగా పూజించిన కావళ్ళతో ఆలయాలకు వెళ్లి మొక్కులు చెల్లిచారు. స్థానిక కరకంఠేశ్వర స్వామి ఆలయంలోని సుబ్రహ్మణ్యస్వామి సన్నిధిలో ప్రత్యేక అభిషేక అర్చనలు చేసి స్వామిని సుందరంగా అలంకరించారు. పట్టణ పరిధి నుంచి అధిక సంఖ్యలో భక్తులు కావళ్ల సమర్పించడానికి తిరుత్తణి సుబ్రహ్మణ్యస్వామి ఆలయానికి వివిధ వాహనాల్లో బయలుదేరి వెళ్లారు.

## స్వగ్రామంలో కావడి వేడుకల్లో ఎమ్మెల్యే గురజాల



గుడిపాల, జులై 29 ప్రభాతవార్త: చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడు సోమవారం స్వగ్రామమైన గుడిపాల మండలం కోలావూరు గ్రామంలో ఆడికృత్తిక కావడి వేడుకలను నిర్వహించుకున్నారు. ఈ క్రమంలో ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడు తన కుమారులతో కావడీలు తీసుకుని మండలంలోని కలికిరికొండలో వెలసిన శ్రీవల్లి సమేత సుబ్రమణ్యేశ్వరస్వామి దేవాలయానికి వెళ్ళి కావడి మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆడికృత్తిక కావడి పురస్కరించుకుని సుబ్రమణ్యేశ్వరస్వామి ఆశీస్సులు తనతో పాటు నియోజకవర్గ ప్రజలందరికీ ఇవ్వాలని కోరుకున్నట్లు తెలిపారు, నియోజకవర్గ ప్రజలందరు సుఖ సంతోషాలతో వుండేలా చూడాలని దేవుడిని ప్రార్థించినట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం సీనియర్ నాయకులు గురజాల చెన్నకేశవులునాయుడు, కుటుంబసభ్యులు గురజాల ప్రతిమ తదితరులు స్వామివారిని దర్శించుకున్నారు. వీరికి కందగిరి ఆలయ ఛైర్మన్, మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు సుబ్రమణ్యంనాయుడు వీరికి స్వామి వారి ప్రత్యేక దర్శనం ఏర్పాటు చేసి స్వామి వారి తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ బాలాజీ నాయుడు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.